సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM
# సాక్ష్యం
తెలుగు దినపత్రిక
సంపుటి: 17 సంచిక: 142
పేజీలు: 08 వెల: రూ.2:00
హైదరాబాద్ బుధవారం 20 మే 2026
Published from Hyderabad, Vijayawada.

## వీధికుక్కలను తరలించాల్సిందే

- ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు
- ప్రతి జిల్లాలో పూర్తిస్థాయిలో బర్త్ కంట్రోల్
- స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లలో కుక్కలను లేకుండా చేయాలి
- గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాల్సిందేనన్న సుప్రీం



న్యూఢిల్లీ,మే19(సాక్ష్యం): వీధికుక్కల బెడదను రూపుమాపాల్సిందేనని సుప్రీం మరోమారు స్పష్టం చేసింది. ఈ విషయంలో రాజీలేదని తెలిపింది. ఇది ప్రజల ప్రాబూల భద్రతకు సంబంధించిన అంశగా పేర్కొంది. బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలను తొలగించాలంటూ గతంలో మిగతా 5 లో..



## విజయ్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయం

**సొంత బలం లేకపోవడమే అతిపెద్ద బలహీనత**
**తమిళనాడు మాజీ సిఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు**


చెన్నై,మే19(సాక్ష్యం): ప్రముఖ సినీ నటుడు విజయ్ నేతృత్వంలో కొత్తగా ఏర్పడిన టీవీకే ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చని డీఎంకే అధినేత, మాజీ మిగతా 2 లో..



## జలమండలిలో భారీ తిమింగలం

**జనరల్ మేనేజర్ కుమార్ ఇళ్లపై ఎసిబి దాడులు**
**సోదాల్లో కుప్పలు తెప్పలుగా నగదు, నగలు స్వాధీనం**

హైదరాబాద్,మే19(సాక్ష్యం): హైదరాబాద్ జలమండలిలో భారీ తిమింగలం పట్టుబడింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన జనరల్ మేనేజర్ కుమార్ నివాసంలో ఏసీబీ అధికారులు మిగతా 2 లో..




## వాట్సాప్ మీసేవలో మరిన్ని జీహెచ్ఎంసీ సేవలు

**అందుబాటులోకి కొత్తగా తొమ్మిది పౌర సేవలు**
**డిజిటల్ సేవలను మరింత విస్తరించిన ప్రభుత్వం**

హైదరాబాద్,మే19(సాక్ష్యం): జీహెచ్ఎంసీకి సంబంధించిన పౌర సేవలను కొత్తగా మీసేవ మిగతా 2 లో..

# వేగంగా పూర్తి చేయండి

## యుద్ధప్రాతిపదికన పాలమూరు-రంగారెడ్డి భూసేకరణ

- వీలైనంత త్వరగా సేకరణ జరగాలని ఆదేశం
- ప్రజాప్రతినిధులతో ప్రాజెక్టులపై సీఎం రేవంత్ సమీక్ష
- పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం
- కేసీఆర్ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దుతాం
- అధికారులతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి పూర్తి చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలన్నారు. నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం భరోసా ఇచ్చారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘారెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీ కృష్ణ, వీర్లపల్లి శంకర్, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు హాజరయ్యారు.**



హైదరాబాద్,మే19(సాక్ష్యం): పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి సీఎం కీలక సూచనలు చేశారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, మిగతా 2 లో..

## తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా ?


- సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో నిర్ణయం
- 23న యాదగిరిగుట్టలో నిర్వహించే యోచన
- అధికారికంగా ప్రకటించడమే తరువాయి



హైదరాబాద్,మే19(సాక్ష్యం): రాజధాని వెలుపల మరోమారు తెలంగాణ కేబినేట్ సమావేశం జరగనుందని సమాచారం. గతంలో మేడారంలో కేబినేట్ నిర్వహించిన సిఎం రేవంత్ రెడ్డి తాజాగా ఇప్పుడు యాదగిరిగుట్టలో కేబినేట్ నిర్వహించేందుకు ఆదేశంచినట్లు తెలుస్తోంది. ఈ నెల 21 జరగాల్సిన కేబినేట్ సమావేశాన్ని 23న నిర్వహించాలని, అదికూడా యాదాద్రిలో నిర్వహించనున్నట్లు సమాచారం. 21 నుంచి సరస్వతీ అంత్య పుష్కరాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాజకీయాలు, పాలనా నిర్ణయాల్లో ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మిగతా 2 లో..

# ప్రాణాంతకమైన ఎబోలా

- ఎబోలా అరికట్టే చర్యలు బలోపేతం
- ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే వారిపై ఆంక్షలు
- వీసాలను తాత్కాలికంగా నిలిపివేసిన అమెరికా
- ఎబోలాపై అప్రమత్తమైన భారత్
- ప్రజలకు హెచ్చరిక చేసిన అధికారులు



**ఎబోలా వ్యాప్తిని నివారించడానికి ముందుజాగ్రత్త చర్యలను బలోపేతం చేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. దీనిలో భాగంగా వ్యాధి వ్యాప్తి చెందిన ఆఫ్రికా ప్రాంతాల నుండి వచ్చే విమాన ప్రయాణికులను పరీక్షించడంతో పాటు, వీసాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా రాయబార కార్యాలయం వెల్లడించింది.**

వాషింగ్టన్,మే19(సాక్ష్యం): డెమోక్రటిక్ రిపబ్లిక్ అఫ్ కాంగో (డి ఆర్ సి) లో ప్రాణాంతకమైన ఎబోలా వ్యాప్తిని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ ఒ) అత్యవసర పరిస్థితిగా ప్రకటించిన నేపథ్యంలో, యుఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి) ఈ నివారణ చర్యలను చేపట్టింది. విమానాశ్రయాలలో స్క్రీనింగ్‌తో పాటు, గత 21 రోజులలోపు ఉగాండా, డి ఆర్ సి, దక్షిణ సూడాన్‌లకు ప్రయాణించిన అమెరికా యేతర పాస్‌పోర్ట్ హోల్డర్లపై ప్రవేశ ఆంక్షలను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఉగాండాలోని కంపాలాలో ఉన్న అమెరికా రాయబార కార్యాలయం అన్ని వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేసి, మిగతా 5 లో..

## ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్ కేర్ ట్రస్ట్

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఈనెల 31లోపు పోర్టల్‌లో ఉద్యోగుల వివరాలు నమోదు

హైదరాబాద్,మే19(సాక్ష్యం): తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్తగా ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యం మిగతా 2 లో..




## పర్యావరణహితంగా అభివృద్ధి

### తెలంగాణలో శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

- సుస్థిర పట్టణాభివృద్ధి, సర్క్యులర్ ఎకానమీ దిశగా చర్యలు
- పక్కాగా ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమం
- బయో ఎరువులు, విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం
- స్వచ్ఛ భారత్ మిషన్ జాతీయ సమీక్షలో భట్టి

న్యూఢిల్లీ,మే19(సాక్ష్యం): తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా, సుస్థిరంగా, సమగ్రంగా, పర్యావరణహితంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి మిగతా 5 లో..

## ఆదిలాబాద్ జిల్లాలో మండుటెండలు

### జనం బయటకు రాలేక నానా తిప్పలు



ఆదిలాబాద్,మే19(సాక్ష్యం): ఆదిలాబాద్ జిల్లాలో భానుడి ప్రతాపం కొనసాగుతున్నది. సోమవారం 44.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా.. మంగళవారం కూడా అదే పరిస్థితి నెలకొంది. మండుటెండల తో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎండ తీవ్రత.. సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతున్నది. ఎండకు వడగాలులు తోడవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

# సంపాదకీయం

## దేశంలో రొయ్యల మార్కెటింగ్ పెంచాలి !

మనదేశంలో సరైన విధానాలు లేక పంటలు పండించిన రైతులు నానా యాతన పడుతున్నారు. సరైన మార్కెటింగ్ ఉండదు. సరైన రవాణా సౌకర్యం ఉండదు. సరైన వేదికలు ఉండవు. మదనపల్లి టమోటాలు పండించినా అవి ప్రజలకు చేరవు. నిజామాబాద్ పసుపు ప్రజలకు భారంగా మారింది. గుంటూరు, వరంగల్, ఖమ్మం మిర్చికి పేరొందినా ధర మా÷–తరం ప్రజలకు ఘాటెక్కిస్తుంది. వడ్లు, మక్కలు, శనగలు పండించినా వాటిని ప్రజలకు చేరువ చేసే యంత్రాంగం ఉండదు. దేశంలో ఏ మూల ఏం పండినా అది మారుమూల ప్రజలకు చేరవేసే సమర్థ వంతమైన మెకానిజం దేశంలో ఇంకా బలపడలేదు. అందుకే రైతులు తమ పండించిన పంటలను దేశంలో ఎక్కడైనా అమ్ముకునే వీలు కలగడం లేదు. వ్యాపారులు కూడా వాటిని కొనుగోలు చేసి, ప్రజలకు చేరవేయడం లేదు. మనదగ్గర మక్కలు పండితే ధరలు రావు. కానీ విదేశీ కంపెనీ కెల్లాగ్ వారు కార్న్ ఫ్లేక్స్ మాత్రం వందల్లో డబ్బులు పోసి పావుకిలో కొంటాం. అదే మన మక్కను వాల్యూ యాడెడ్ చేసి అమ్ముకో లేక పోతున్నాం. తాజాగా ఆక్వా రైతుల పరిస్థితి అదేవిధంగా ఉంది. విజినరీ చంద్రబాబు కేంద్రానికి లేఖ రాసి ఆక్వా రైతులను ఆదుకోవాలన్నారే తప్ప, అందుకు మార్గాలను మాత్రం అన్వేషించడం లేదు. సైనికులకు సరిహద్దుల్లో సరైన ఆహారం దొరకడం లేదని ఆరోపణలు ఉన్నాయి. సైన్యం మెనూలో ఆక్వాను చేర్చాలని చంద్రబాబు కోరారు. ఇది మంచి ఆలోచనగానే గుర్తించాలి. అలాగే ప్రజలకు కూడా ఆక్వాను నేరుగా సరఫరా చేయగలగాలి. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిలో గణనీయ స్థాయిలో భాగస్వామ్యమవుతున్న చేపల, రొయ్యల రైతులకు ఆపన్నహస్తం అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాసి సరిపెడితే ఎలా అన్నది ఆలోచించాలి. తన పరిధిలోని సమస్యల పరిష్కారానికి కూడా చిత్తశుద్ధి చూపించట్లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఈ నిర్వాకం ఆక్వా రైతులను అధోగతి పట్టిస్తోంది. ట్రంప్ సుంకాలు, ధరల పతనం, వ్యాధులు, మేత రేట్ల మోత, పెట్రో ఛార్జీల పెంపు.. ఆక్వా రైతును ఒకదాని వెంట మరొక సమస్య చుట్టుముట్టి గుక్కతిప్పుకోనీయడంలేదు. మరోవైపు రూ.వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం, పన్ను ఆదాయాలను తమ బొక్కసంలో వేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వానికి, ఇబ్బందులతో సతమతమవుతున్న ఆక్వా రైతులకు ఆదుకోడానికి అస్సలు చేతులు రావట్లేదు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాగానే బాదిన సుంకాలతో మొట్టమొదట నష్టపోయింది రొయ్య రైతులు. మన రొయ్యలపై అమెరికా 60 శాతం వరకు దిగుమతి సుకం బాదింది. ఇక్కడ ధరలు 20–30 శాతం పడిపోయాయి. అమెరికా సుంకాల ప్రభావం మన రాష్ట్రం నుంచి ఏటా జరుగుతున్న రూ.25 వేల కోట్ల విలువైన ఆక్వా ఎగుమతులపై పడింది. సుంకాలు తగ్గించేలా మోడీ ప్రభుత్వం ట్రంప్‌తో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని రైతులు ఆందోళనలు చేపట్టినా ఫలితం కానరాలేదు. ఆక్వా రైతులను ఆదుకోవడానికి ఎపిలో కూటమి ప్రభుత్వం కూడా పెద్దగా పట్టుపట్టడం లేదు. ఒకటికి రెండు సార్లు లేఖలు రాయడం తప్ప టిడిపి ప్రభుత్వం చేసిందేమీ లేదు. అంతలోనే ఫీడ్ కంపెనీలు ఇష్టానుసారం ఏకపక్షంగా ధరలు పెంచేందుకు తెగబడగా రైతాంగం నుంచి తీవ్ర నిరసనలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగి తాత్కాలికంగా ఆపించింది. ఫిబ్రవరిలో ఒకసారి ఫీడ్ ధరలను కిలోపై రూ.4 పెంచాయి. కేంద్రం కొన్ని రకాల పన్నులు తగ్గించిన సందర్భంలో కంపెనీలు నామమాత్రంగా ధరలు తగ్గించి, కొన్ని రోజులకే పెంచాయి. తిరిగి కిలోపై రూ.10 వరకు పెంచుతున్నట్లు ప్రకటించి వెనక్కి తగ్గాయి. ఎపి ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం ప్రకారం ఫీడ్ ధరలను కంపెనీలు తమకు తాము పెంచడానికి వీల్లేదు. ప్రభుత్వం సమక్షంలో రైతులు, కంపెనీల మధ్య సంప్రదింపులతో జరగాలి. వరి, ఆహార ధాన్యాల కంటే చేపలు, రొయ్యల సాగుతో అధిక ఆదాయం వస్తుందని ఊదరగొట్టాయి. దాంతో రొయ్యల సాగు 4.7 లక్షల ఎకరాలకు విస్తరించింది. అనధికారిక సాగు ఇంకా ఎక్కువే ఉంటుంది. ఆక్వా సాగు రోజు రోజుకూ కాస్ట్లీ అయింది. రైతులు ఆ వైపు మళ్లడంతో గాలివాటుగానూ తయారైంది. వ్యాధులు, ప్రకృతి విపత్తులు తరచు నష్టాలు కలిగిస్తున్నాయి. తరచు ధరల పతనం, అదనంగా ట్రంప్ సుంకాల ప్రభావం, తాజాగా యుద్ధం కారణంగా పెట్రోలు, డీజిల్‌కు కొరత. అంతలోనే వాటి ధరల పెంపు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. కూటమి సర్కార్ తాము ఫీడ్ ధరలు తగ్గించామని, యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే ఇస్తున్నామంటోంది. పెరిగిన ఫీడ్ ధరలతో పోల్చితే ప్రభుత్వం తగ్గించింది చాలా తక్కువ. విద్యుత్ సబ్సిడీకి సైతం పలు ఆంక్షలు అమలవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని ఫీడ్ ఛార్జీలు సహా ఇతర సమస్యలను పరిష్కరించి ఆక్వారైతులను, ఆ రంగంపై ఆధారపడ్డ లక్షలాది మందిని ఆదుకోవాల్సి ఉంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇప్పుడు దేశీయంగా వీటిని ప్రజలకు చేరువ చేయాలి. 140 కోట్లకు పైగా ఉన్న మన దేశ ప్రజలకు సమతుల్య ఆహారం అవసరం. ఇందులో చేపలు, రొయ్యలు కూడా చేర్చాలి. అందుకు ప్రభుత్వాలు కార్యాచరణ చేయాలి. ప్రజల ఆహారం లో మన పంటలు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేస్తే, ఏ పంటయినా అమ్ముడు పోతుంది. మనదేశంలోని అన్ని పట్టణాలకు రొయ్యలు చేరేలా చేయాలి. అలా చేయకుండా ఎన్ని ప్రకటనలు గుప్పించినా లాభం లేదు. ఇప్పటికీ హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు సక్రమంగా రొయ్యలు చేరడం లేదు. రైతులు పండించే పంటలకు సరైన మార్కెటింగ్ వ్యవస్థ లేనంత కాలం ఇలాంటి సంక్షోభాలు ఎదుర్కోవాల్సిందే. అందుకు ప్రభుత్వాలదే బాధ్యత.

## వీధికుక్కలను తరలించాల్సిందే

మొదటిపేజీ తరువాయి..

జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గతంలో జారీ చేసిన ఆ ఉత్తర్వులను సవరించాలని చేసిన విజ్ఞప్తిని కూడా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. స్కూల్, కాలేజీ, రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర బహిరంగ ప్రదేశాల్లో కుక్కలను తొలగించాలంటూ జంతు ప్రేమికులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం విచారించింది. ఈ సందర్భంగా జంతు సంక్షేమ బోర్డు దాఖలు చేసిన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా తన తీర్పులో.. పలు కీలక అంశాలను సుప్రీంకోర్టు ప్రస్తావించింది. వీధి కుక్కల సమస్యను జంతు సంక్షేమ అంశంగా కాకుండా ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించాలని పిటిషనర్లకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా రూపొందించిన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయడం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. ప్రతి జిల్లాలో కనీసం ఒక పూర్తి స్థాయి యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. జనాభాను దృష్టిలో ఉంచుకొని అవసరమైతే జిల్లాలో ఈ కేంద్రాల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రజల భద్రత దృష్టిలో ఉంచుకుని స్కూళ్లు, కాలేజీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లతోపాటు ఇతర ప్రదేశాల్లో కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా యాంటీ రేబిస్ మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. రహదారులపై సంచరించే పశువుల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జాతీయ రహదారులపై తిరిగే జంతువుల సమస్యల పర్యవేక్షణ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్‌ఏఐను కోరింది. రేబిస్ బారిన పడిన లేదా మానవుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించే ప్రమాదకర కుక్కల విషయంలో చట్టబద్ధంగా అనుమతించిన చర్యలు తీసుకోవచ్చని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల అమలు కోసం విధులు నిర్వహించే ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వాలకు సూచించింది. విధులు నిర్వర్తించే క్రమంలో వారిపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# వేగంగా పూర్తి చేయండి

మొదటిపేజీ తరువాయి..

వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదుల, ఎస్ఎల్‌బీసీ, సీతారామ ప్రాజెక్టులతో సమాన ప్రాధాన్యం ఇస్తామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో పాలమూరు – రంగారెడ్డి పనులు 90శాతం పూర్తి అయ్యాయన్నది అసత్యమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారని విమర్శించారు. మంగళవారం సచివాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. పాలమూరుకు కేసీఆర్ హయాంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని చెప్పుకొచ్చారు. జూరాల ప్రాజెక్టులో పూడిక తొలగించి నిల్వ సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. జూరాల సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 1226 గ్రామాలకు



అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామని వివరించారు. వర్షాకాలానికి ముందే చెరువుల్లో పూడికతీత పనులు చేపడతామని స్పష్టం చేశారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. 12.30 లక్షల ఎకరాలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. 15 రోజుల్లో మరోసారి ప్రగతి సమీక్ష నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

## తెలంగాణ కేబినేట్ భేటీ 23కు వాయిదా ?

మొదటిపేజీ తరువాయి..

నిర్వహణ అత్యంత ఆసక్తికరంగా మారింది. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం కాకుండా, కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేసే యోచనలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి ప్రధాన కారణం ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసరలో ప్రారంభం కానున్న 'సరస్వతి అంత్య పుష్కరాలు' కావడం గమనార్హం. అదే సమయంలో, ఈ కేబినెట్ భేటీని కేవలం వాయిదా వేయడమే కాకుండా, హైదరాబాద్ వెలుపల మరో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. 'బాసర సరస్వతి అంత్య పుష్కరాలు' ఈ నెల 21వ తేదీన ప్రారంభం కానున్నాయి. గోదావరి నది తీరాన వెలసిన బాసర క్షేత్రంలో జరిగే ఈ అంత్య పుష్కరాలకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ చరిత్రాత్మక వేడుకకు రాష్ట్ర మంత్రివర్గంలోని మెజార్టీ మంత్రులు హాజరు కానున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటం, పుష్కరాల పనులను పర్యవేక్షించడం మంత్రులకు విధిగా మారింది. మంత్రులంతా పుష్కరాల పనుల్లో, అధికారిక పర్యటనల్లో నిమగ్నమవ్వడం, బాసరకు వెళ్లనుండటంతో.. అదే రోజు నిర్వహించాలనుకున్న కేబినెట్ సమావేశాన్ని వాయిదా వేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ నెల 23వ తేదీన ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నారు. రాజధాని హైదరాబాద్‌లోని సచివాలయానికే పరిమితం కాకుండా, ప్రజలకు, పుణ్యక్షేత్రాలకు దగ్గరగా పాలనను తీసుకెళ్లాలనే ఆలోచనలో భాగంగానే ఈ వ్యూహాన్ని రచిస్తున్నారు. యాదగిరి లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న ఈ పవిత్ర క్షేత్రంలో



కేబినెట్ భేటీ నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక, రాజకీయ సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లవచ్చని సీఎం భావిస్తున్నారు. గతంలో ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క – సారలమ్మ జాతర సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలో కేబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. అక్కడికక్కడే జాతర ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలు, నిధుల విడుదలపై కీలక నిర్ణయాలు తీసుకుని రికార్డు సృష్టించారు. ఇప్పుడు అదే తరహా వ్యూహాన్ని యాదగిరిగుట్ట లోనూ అమలు చేయాలని చూస్తున్నారు. దీనివల్ల స్థానిక సమస్యలపై తక్షణమే స్పందించే అవకాశం లభిస్తుందని నమ్ముతున్నారు. బాసర అంత్య పుష్కరాల కారణంగా ఈ నెల 21న జరగాల్సిన కేబినెట్ వాయిదా పడటం, దానిని ఈ నెల 23న యాదగిరిగుట్టకు మార్చాలని యోచించడం అందులో భాగమే. అయితే ఈ మార్పుపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## వాట్సాప్ మీసేవలో మరిన్ని జీహెచ్ఎంసీ సేవలు

మొదటిపేజీ తరువాయి..

వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు మరింత సౌకర్యం, అందుబాటు, పారదర్శకత కల్పించే దిశగా ఈ సేవలను విస్తరించారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో మీసేవ ద్వారా పౌర సేవలను మరింతగా తీర్చిదిద్దుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

÷ాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ సేవల ప్రధాన వేదికగా ఉన్న మీసేవను వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా మరింత విస్తరించారు. ఈ అదనపు డిజిటల్ ఛానల్‌ను 2025 నవంబర్ 18న ప్రారంభించారు. కొత్తగా జీహెచ్ఎంసీ ప్రాపర్టీ అసెస్‌మెంట్ రివిజన్, జనన ధ్రువీకరణ సవరణ, మరణ ధ్రువీకరణ సవరణ, బర్త్ హోమ్, డెత్ హోమ్, ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ, ప్రాపర్టీ పేరు సవరణ, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు, ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ సేవలను వాట్సాప్ మీసేవలో చేర్చారు. ÷ాష్ట్రవ్యాప్తంగా పౌరులు ఈ సేవలను వాట్సాప్ ద్వారానే పొందవచ్చని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం తెలిపింది. సేవలు పొందేందుకు ముందుగా 8096958096 నంబర్‌ను మొబైల్‌లో పేరుతో సేవ్ చేసుకోవాలి. అనంతరం వాట్సాప్‌లో ఆ నంబర్‌కు సందేశం పంపాలి. అవసరమైన సేవ పేరు టైప్ చేసి, మెనూలో కనిపించే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఫారంలో అడిగిన వివరాలు, చెల్లింపు పూర్తిచేస్తే దరఖాస్తు వెంటనే వాట్సాప్ ద్వారా నమోదవుతుంది. వాట్సాప్ ఆధారిత మీసేవ వేదికకు ప్రారంభం నుంచి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ప్రభుత్వం వెల్లడించింది. జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పోలీస్ చలాన్, విద్యుత్ బిల్లు, బీఐఈ ఫలితాల సేవలను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలిపింది. రోజువారీ పరిపాలన సేవలకు వాట్సాప్‌పై ప్రజల ఆధారపడటం పెరుగుతోందని పేర్కొంది. డిజిటల్ సేవలను నిరంతరం విస్తరించడం, ప్రభుత్వ వ్యవస్థల విశ్వసనీయతను బలోపేతం చేయడం, పౌరులకు సులభమైన అనుభవం కల్పించడం తమ లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

## జలమండలిలో భారీ తిమింగలం

మొదటిపేజీ తరువాయి..

సోదాలు నిర్వహించగా భారీ ఎత్తున నగదు, నగలు, ఆస్తుల చిట్టాలు బయటపడ్డాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఈ తనిఖీలు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి.. హైదరాబాద్‌తో పాటు మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. మల్లాపూర్‌లోని కుమార్ ఇంట్లో ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో తనిఖీలు ప్రారంభించారు. జీఎం కుమార్ బంధువుల ఇళ్లలోనూ సోదాలు కొనసాగాయి. ఈ తనిఖీల్లో భారీగా నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కుప్పలుగా ఉన్న నోట్ల కట్టలు చూసి అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఇంట్లో ఎక్కడ చూసినా నోట్ల కట్టలే దర్శనమివ్వడంతో.. ఆ నగదు లెక్కింపునకు కౌంటింగ్ మెషీన్లను అధికారులు వినియోగించారు. దాదాపు రూ.1.20 కోట్ల నగదు,1.5 కిలోల బంగారు ఆభరణాలు, 2.5 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్‌లో 3 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో మూడు ఫ్లాట్‌లు, 6 ఓపెన్ ప్లాట్‌లను అధికారులు గుర్తించారు. బ్యాంకు లాకర్లను ఓపెన్ చేసి మరిన్ని ఆస్తులను గుర్తించేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమయ్యారు. మల్లాపూర్‌లోని కుమార్ నివాసంలో 2 కార్లను సీజ్ చేశారు. మార్కెట్ విలువ ప్రకారం ప్రాథమికంగా 100 కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. గత నెలలో తన కుమార్తె వివాహాన్ని కుమార్ అంగరంగ వైభవంగా ఎంతో డబ్బులు వెచ్చించి మరీ జరిపించాడు. వివాహం కోసం కొన్ని కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఆ డబ్బులు ఎలా సంపాదించారనే దానిపై కుమార్ వద్ద నుంచి ఏసీబీ అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.



## విజయ్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయం

మొదటిపేజీ తరువాయి..

సీఎం ఎం.కె. స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయ్ ప్రభుత్వం పూర్తిస్థాయి మద్దతు లేక అస్థిరంగా ఉందని, ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉన్నందున డీఎంకే శ్రేణులు ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. డీఎంకే కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత ప్రభుత్వం ఏక్షణమైనా కూలిపోవచ్చుఅని, డీఎంకే పార్టీ కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. సొంతంగా 107 సీట్లు సాధించిన టీవీకే మిత్రపక్షమైన కాంగ్రెస్ 5 సీట్లు, సీపీఐ 2, సీపీఎం 2, వీసీకే 2 సీట్లు సాధించిన డీఎంకే మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇస్తున్న తమ మిత్రపక్షాలైన వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్ మద్దతు నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా, లేదా తమిళనాడు స్పీకర్ గానీ, కోర్టులు గానీ రెబెల్ ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలను చివరికి అనర్హులుగా ప్రకటించినా రాజకీయ అస్థిరత ఏర్పడవచ్చని పేర్కొన్నారు. గతంలో ఎన్నికల పరాజయాల నుండి డీఎంకే ఎలా పుంజుకుందో గుర్తు చేశారు. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ ఓటమి తాత్కాలికమైందని, తాము మళ్లీ విజయం సాధిస్తామని కార్యకర్తలకు భరోసానిచ్చారు. తమిళనాడులో సూర్యుడు (డీఎంకే గుర్తు) ఎప్పటికీ అస్తమించదు' అని స్టాలిన్ స్పష్టం చేశారు. ఓటమికి వ్యక్తిగత బాధ్యత తీసుకుంటానని, సోషల్ మీడియాలో పార్టీపై వచ్చే విమర్శలను తిప్పికొట్టాలన్నారు. ఈ విషయంలో టీవీకే చాలా ముందుందని పరోక్షంగా సూచించారు.

# దేశంలో చాపకింద నీరులా మతమార్పిళ్లు

### నాసిక్ ఘటన మరువక ముందే మరో ఘటన.. యూపిలో నెట్‌వర్క్‌ను ఛేదించిన పోలీసులు

### పదిమంది నిందితుల అరెస్ట్.. ముమ్మర దర్యాప్తు

లక్నో,మే19(సాక్ష్యం): నాసిక్‌లోని ఓ బహుళజాతి కంపెనీలో బలవంతపు మత మార్పిళ్లు, లైంగిక వేధింపులు చోటుచేసుకోవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అటువంటి మరో ఘటన ఉత్తర్‌ప్రదేశ్ లోని మిర్జాపూర్‌లో వెలుగులోకి వచ్చింది. జిమ్‌లలో చేరే మహిళలను లక్ష్యంగా చేసుకొని మత మార్పిళ్లు చేస్తున్న నెట్‌వర్క్‌ను పోలీసులు గుర్తించారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. మిర్జాపుర్‌లోని ఓ జిమ్ యజమాని మతం మారాలని బలవంతం చేస్తున్నట్లు ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై విచారణ చేస్తుండగా.. దీని వెనుక పెద్ద నెట్ వర్క్ ఉన్నట్లు గుర్తించారు.

నిందితులు రాష్ట్రంలోని వివిధ జిమ్‌లు, సోషల్‌మీడియాల్లో ముందుగా మహిళలతో పరిచయాలు పెంచుకొని.. అనంతరం మత మార్పిడి చేసుకోవాలని వారిపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దాదాపు 50 మందికి పైగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో సన్నో అనే మహిళ ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ముందుగా జిమ్‌లలో చేరి అక్కడి యువతులతో పరిచయం పెంచుకుంటుందని.. అనంతరం తన స్నేహితులుగా పేర్కొంటూ పలువురు ముస్లిం యువకులను వారికి పరిచయం చేస్తుందని పేర్కొన్నారు. మరికొందరు మహిళలను నిందితులు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్‌ల ద్వారా పరిచయం పెంచుకొని.. వారిలో మతమార్పిడి ఆలోచనలు కలిగేలా బ్రెయిన్ వాష్ చేసేవారని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్‌లలో వందలాది మంది మహిళల ఫొటోలు, వీడియోలు, చాట్‌లు ఉన్నాయని.. వాటిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కేసు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ దృష్టికి వెళ్లడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. నిందితులపై గ్యాంగ్‌స్టర్ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కేసులో ఇప్పటివరకు 10మంది అనుమానితులను అరెస్ట్ చేశామని.. దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు.

## ప్రజలకు చేరువ కోసమే హైవే స్టేషన్లు

### ట్రాఫిక్ నియంత్రణలకు అధునాతన పద్ధతులు
### డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వ్యాఖ్య

విశాఖపట్నం,మే19: ప్రజలకు చేరువగా ఉండేందుకు హైవే పక్కన పోలీసుస్టేషన్‌లను ప్రారంభించామని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వ్యాఖ్యానించారు. ట్రాఫిక్ నియంత్రణకు అధునాతన సాంకేతిక పద్ధతులను వినియోగిస్తామని పేర్కొన్నారు. మంగళవారం కంచరపాలెం ట్రాఫిక్, ఎయిర్ పోర్ట్ ట్రాఫిక్, ఎయిర్ పోర్ట్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను డీజీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ ట్రాఫిక్ వింగ్ కోసం ప్రత్యేక ఐపీఎస్ అధికారిని నియమిస్తామని డీజీపీ తెలిపారు. రానున్న రోజుల్లో ఈ స్టేషన్‌లోనే సైబర్ క్రైమ్ స్టేషన్‌ను ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. కోస్టల్ సెక్యూరిటీ హెడ్‌క్వార్టర్ నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. కోస్టల్ సెక్యూరిటీని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కోస్టల్ ప్రాంతంలో 21 పోలీసుస్టేషన్లు ఉన్నాయని వెల్లడించారు. ప్రజా భద్రత, మహిళల రక్షణెలి తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. మహిళల భద్రతకు మరింత ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. మహిళలకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కొవాలని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా సూచించారు.

## మోడల్ స్కూల్స్‌లో కాంట్రాక్ట్ సిబ్బందికి ఊరట

### కాంట్రాక్ట్‌ను మరో 11 నెలలు పొడిగింపు

అమరావతి,మే19: ఏపీ మోడల్ స్కూల్స్‌లో కాంట్రాక్ట్ సిబ్బంది సేవలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పొడిగించింది. 123 మంది ఫిజికల్ డైరెక్టర్లు, 120 మంది కంప్యూటర్ టీచర్ల సేవలను పునరుద్ధరించింది. 2026 జూన్ 1వ తేదీ నుంచి 2027 ఏప్రిల్ 30వ తేదీ వరకు 11 నెలల పాటు సేవలకు అనుమతి ఇచ్చింది. అకడమిక్ ఇయర్ 2026–27 కోసం కాంట్రాక్ట్ సిబ్బందికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఒక నెల విరామంతో సేవల కొనసాగింపునకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జీఓ ఆర్టీ నంబర్–51ను స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ విడుదల చేసింది. ఈ మేరకు ÷నాన్స్ శాఖ అనుమతితో ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## ఎపిలో వెయ్యి మినీ మార్టులు

### తక్కువ ధరలకే సరుకులు అందచేస్తాం
### పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

న్యూఢిల్లీ,మే19: రాబోయే రోజుల్లో ఏపీలో వెయ్యి మినీ మార్టులు ఏర్పాటు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రెండో రోజు దిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రానికి చెందిన పలు కీలక అంశాలపై వారితో చర్చించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

మినీ మార్టుల ద్వారా మిల్లెట్స్ కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని మనోహర్ తెలిపారు. మినీ మార్టులలో మార్కెట్ ధరల కంటే తక్కువకు నాణ్యమైన సరకులు అందజేస్తామన్నారు. మరోవైపు.. అరకు కాఫీని దేశవ్యాప్తంగా అన్ని మిలిటరీ క్యాంటీన్లలో ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారని మంత్రి వివరించారు.

## మత్స్యకారులకు నిధులు విడుదల

### బోట్లతో హర్షం వ్యక్తం చేసిన జాలర్లు

విజయవాడ,మే19: కృష్ణానదిలో మత్స్యకారులు బోట్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన గంగపుత్రులు బోట్ల ప్రదర్శన చేశారు. వరుసగా రెండో ఏడాది 'మత్స్యకారుల సేవలో' పథకం కింద నిధుల విడుదల చేయడంపై మత్స్యకార కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. తమ సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా కృష్ణానదిలో బోట్ల ర్యాలీతో మత్స్యకారులు ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. వేట నిషేధ సమయంలో ఇబ్బంది పడకుండా ఒక్కో కుటుంబానికి రూ.20 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇస్తోంది. గత ఏడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్ల సాయం అందచేయగా.. ఈ ఏడాది 1,30,796 కుటుంబాలకు రూ.262 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

## దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో గందరగోళం

### కొనుగోళ్లు నిలిచి పోవడంతో రైతుల ఆందోళన

గుంటూరు,మే19: గుంటూరు జిల్లా దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో వ్యాపారులు కుమ్మక్కై కొనుగోళ్లను నిలిపివేశారు. టెండరు ధర ప్రకారం కొనుగోలు చేయాలని వ్యాపారులకు రైతులు, అధికారులు తెల్చి చెప్పారు. దీంతో వ్యాపారులంతా ఏకమై పసుపు కొనుగోలు చేయకుండా వెళ్లిపోయారు. కొనుగోళ్లు నిలిచిపోవడంతో దూర ప్రాంతాల నుంచి పసుపు తీసుకొచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పసుపు ధర బాగుందని, మంచి లాభాలు వస్తాయని ఆశించామని రైతులు చెబుతున్నారు. వ్యాపారుల నిర్వాకంతో పసుపు రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బాగా పండిన పంటను ప్రభుత్వం సూచించిన ధరకు కాకుండా.. తమకు నచ్చిన ధరకు కొనుగోలు చేయాలని వ్యాపారులు చూస్తున్నారని రైతుల ఆరోపిస్తున్నారు.

## వినుకొండ ఆస్పత్రిలో పేలిన ఎసి

గుంటూరు,మే19: వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఏసీ పేలిన ఘటన కలకలం రేపింది. ఆసుపత్రిలోని ఒక గదిలో ఏర్పాటు చేసిన ఎయిర్ కండిషనర్ అకస్మాత్తుగా భారీ శబ్దంతో పేలినట్లు తెలుస్తోంది. ఘటన జరిగిన సమయంలో అక్కడ ఉన్న సిబ్బంది, రోగులు భయాందోళనకు గురయ్యారు. ఏసీ పేలుడు కారణంగా గదిలో స్వల్పంగా పొగ వ్యాపించింది. వెంటనే అప్రమత్తమైన ఆసుపత్రి సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. ఏసీ పేలడానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

## మల్బరీ తోటలు పరిశీలించిన కలెక్టర్

అనంతపురం,మే19: అనంతపురం జిల్లాలోని కుందుర్పి మండలంలో జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆకస్మికంగా పర్యటించారు. కుందుర్పి మండల పరిధిలోని ఎనములదొడ్డి గ్రామంలో సాగు చేసిన పంటలను అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడ ప్రధానంగా సాగుచేసిన మలబరి తోటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. పంటల సాగు విషయంలో అన్నదాతలకు పలు సూచనలు చేశారు.

# మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండ

- మత్స్యకారుల సేవలో' పథకం కింద రూ.262 కోట్లు విడుదల
- మన తీరంలో మనదే బోటు..మనదే వేట
- పొరుగు రాష్ట్రాల మత్స్యకారులకు స్థానం లేదు
- సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టీకరణ

నెల్లూరు,మే19: మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం తుమ్మలపెంటలో 'మత్స్యకారుల సేవలో' పథకం కింద రూ.262 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. చరిత్రలో తొలిసారి రూ.262 కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. రూ.3,256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. 'బోటూ మనదే.. వేటా మనదే' అని సీఎం అన్నారు. తీరం మనదే.. బోటు మనదే.. వేటా మనదే.. రాజీలేదు. ఎవరైనా వస్తే రానిచ్చే పరిస్థితి లేదు. భయపడేది లేదు. ఎవరి కోసమో మన జీవనోపాధి కోల్పోవడమేంటి? మన తీరంపై మనకే హక్కులుంటాయన్నారు. పొరుగు రాష్ట్రాలు రావడానికి లేదు. బోటు చొరబడగానే కలెక్టర్‌కు మెసేజ్ వస్తుంది. మెసేజ్ రాగానే అప్రమత్తమవుతాం.. ఎవరినీ రానివ్వం అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మత్స్యకారులకు ఎల్లప్పుడూ ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది. వేట నిషేధ సమయంలో రూ.20 వేలు ఆర్థిక భరోసా ఇస్తున్నాం. చరిత్రలో తొలిసారిగా రూ.260



కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో వేశాం. గతేడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్ల సాయం అందించాం. ఇవాళ 1,30,796 కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సాయం అందించాం. 2014–19లో మత్స్యసంపద ఉత్పత్తి 19.18శాతం పెరిగింది. కానీ, వైకాపా హయాంలో నాలుగు రెట్లు పడిపోయింది. వ్యవసాయం, నిర్మాణ రంగం తర్వాత.. మత్స్య సంపదపైనే ఎక్కువ మంది ఆధారపడ్డారు. దేశంలో రొయ్యల ఉత్పత్తిలో 80శాతం ఏపీ నుంచే ప్రపంచానికి ఎగుమతి అవుతున్నాయి. సముద్రపు నీటితో సీవీడ్ కల్చర్ చేస్తే డబ్బులే.. డబ్బులు. మగవాళ్లు వేటకు వెళ్తే.. మహిళలు సీవీడ్ పండించాలి. మహిళలకు ఆదాయం పెంచే మార్గాలు సూచిస్తున్నా.. పాటించండి. మత్స్యకారుల జీవితాలు మెరుగుపడాలి. వారి జీవితాల్లో వెలుగు నింపే బాధ్యత ఈ ప్రభుత్వానిదని సీఎం అన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు ఇబ్బందులు ఉండవన్నారు. జువ్వలదిన్నె హార్బర్‌ను త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. 'జువ్వలదిన్నె హార్బర్ మీ సొంతం.. నకిలీ ప్రచారాలు నమ్మొద్దన్నారు. చేపలు తింటే డయాబెటిస్ రాదన్నారు. 'మీ చేపల ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తా' అని అన్నారు. 200 మెకనైజ్డ్ బోట్ల మంజూరుతో పాటు రాయితీ ఇస్తామన్నారు. ఆక్వాను ఎక్కువ చేయాలని సీఎం పేర్కొన్నారు. వైసీపీ హయాంలో మత్స్యకారుల సాయాన్ని రూపాయి కూడా పెంచలేదని సీఎం విమర్శించారు. 2019–24 మధ్య జగన్ విధ్వంసకర పాలన చేశారని మండిపడ్డారు. 18 నెలల్లో తిరుపతి నుంచి బుల్లెట్ వాహనాలు తయారీ మొదలవనుందని తెలిపారు. ప్రస్తుతం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. టీడీపీ డీఎన్‌ఏలో బీసీలు ఉన్నారని.. మనది తిరుగులేని అనుబంధమని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. పరిశ్రమలు, అభివృద్ధిని గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోందన్నారు. సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌లో స్థానికులకే ఉద్యోగాలు అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

# తీరప్రాంత భద్రతపై అప్రమత్తం

- ఎల్లవేళలా నిరంతర గస్తీతో పర్యవేక్షణ
- సీ పెట్రోలింగ్‌కు జాయింట్ టాస్క్‌ఫోర్స్
- అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశం
- మత్స్యకారుడి ఇంట్లో గరిటె తిప్పిన బాబు

నెల్లూరు,మే19: ఏపీ సముద్ర తీర ప్రాంత భద్రతపై



అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సముద్రంలో నిరంతర గస్తీ కోసం పలు శాఖల అధికారులు, స్థానిక మత్స్యకారులతో సీ పెట్రోలింగ్ జాయింట్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. నెల్లూరు సముద్ర తీరంలో నిరంతర గస్తీ కోసం ఏర్పాటు చేసిన జాయింట్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ పెట్రోలింగ్ కేంద్రాన్ని సీఎం చంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. డ్రోన్ల ద్వారా గస్తీ నిర్వహిస్తూ, హెచ్చరికలు జారీ చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని అధికారులు ప్రదర్శించారు. తమిళనాడు, పాండిచ్చేరి మరబోట్ల కదలికలపై శాటిలైట్ చిత్రాల సాయం తీసుకోవాలని ఆదేశించారు. జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థలను విస్తృతంగా వినియోగంలోకి తేవాలని సూచించారు. ఏపీ వ్యాప్తంగా ఫిష్ సీడ్ ఉత్పత్తిని పెంచాలని అధికారులకు సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు. ఇదిలావుంటే నెల్లూరు జిల్లా తుమ్మలపెంటలో నిర్వహించిన 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం చేపల మార్కెట్‌కు వెళ్లి చేపలు కొనుగోలు చేశారు. అనంతరం మత్స్యకారుడు తానంగారి గిరిబాబు ఇంటికి వెళ్లారు. ఆయన ఇంట్లో చేపల కూర వండుతుండగా ముఖ్యమంత్రి కూడా కాసేపు గరిటె తిప్పారు. ఆ తర్వాత గిరిబాబు కుటుంబంతో కలిసి భోజనం చేశారు.

# మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

### వేట నిషేధ భృతిని అందిస్తున్న సిఎం చంద్రబాబు
### మత్స్యకారుల సేవ కార్యక్రమంలో మంత్రి కొట్టు రవీంద్ర

మచిలీపట్నం,మే19: మత్స్యకారులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అన్ని రకాలైన కార్యక్రమాలూ చేపడుతుందని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల్లో ఎక్కడా లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేట నిషేధ భృతిని మత్స్యకారులకు తొలిసారిగా ప్రకటించింది సీఎం చంద్రబాబు నాయుడే అని ఈ సందర్భంగా గుర్తుచేశారు.



మంగళవారం మచిలీపట్నం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'మత్స్యకారుల సేవ' కార్యక్రమానికి మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. తొలుత బియ్యం, నిత్యవసర వస్తువులతో పాటు డీజిల్ సబ్సిడీ కోసం నాడు నడకుదిటి నరసింహరావు కృషి చేశారని వివరించారు. మత్స్యకారులకు వేట నిషేధ భృతి ఏకంగా రూ.20వేలకు పెంచామని కొల్లు రవీంద్ర వివరించారు. తనకు మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసునన్నారు. రూ.4,000తో ప్రారంభించిన వేట నిషేధ భృతిని రూ.20 వేల వరకు పెంచిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రూ.260 కోట్లు మత్స్యకార భరోసా పథకంతో మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయడం హర్షణీయమన్నారు. మత్స్యకారుల జీవితాలను నాశనం చేసేలా వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రెడ్డి జీవో నెం.217 తీసుకొస్తే.. దానిని కూటమి ప్రభుత్వం రాగానే రద్దు చేసిందని తెలిపారు. కృష్ణా జిల్లాలో 18 వేల మంది మత్స్యకారులకు వేట నిషేధ భృతిని అందించామని ఎక్సైజ్ శాఖ మంత్రి వివరించారు. డీప్ సీ బోట్స్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.1.20 కోట్లు కేటాయించినా.. ఇక్కడ సదుపాయాలు లేవన్నారు. సీ వీడ్ (సముద్రపు నాచు) పండించడం ద్వారా కూడా మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మచిలీపట్నంలో రూ.75 లక్షల వ్యయంతో పీతల హేచరీ ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. మత్స్యకారులు 250 బోట్లతో ముఖ్యమంత్రి చంద్రబాబుకి ధన్యవాదాలు చెప్పడం హర్షణీయం అన్నారు. మత్స్యకారులను ఇంటికి పిలిచి విందు ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర ధన్యవాదాలు తెలిపారు.

# కులాలు, మతాల మధ్య చిచ్చుతో రాజకీయం

### జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం,మే19: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కులాలు మతాల పేరుతో విభజన రాజకీయాలు చేస్తున్నారని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో దళితులపై జరిగిన దాడులు మర్చిపోలేనివని చెప్పుకొచ్చారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన దళితుడు సుబ్రహ్మణ్యం నాల్గోవర్ధంతి మచిలీపట్నం బలరామునిపేటలోని ఎస్సీ కాలనీలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ నాయకులు, కాలనీలోని దళిత ప్రముఖులతో మంత్రి కొల్లు రవీంద్ర సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్ హయాంలో ఒక్క దళితులనే కాదని.. బీసీలు, మైనార్టీలు కూడా పెద్దఎత్తున దాడులకు గురయ్యారని మంత్రి కొల్లు రవీంద్ర ప్రస్తావించారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర డ్రైవర్‌గా పనిచేసిన దళితుడు సుబ్రహ్మణ్యంను చంపి శవాన్ని డోర్ డెలివరీ చేశారని ధ్వజమెత్తారు. నాడు ఆ కేసును తారుమారు చేసేందుకు జగన్ అనేక ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కేసును నిష్పక్షపాతంగా విచారిస్తుంటే సాక్షులను ట్యాంపర్ చేసే ప్రయత్నాలు చేశారని చెప్పుకొచ్చారు. మాస్క్ అడిగిన పాపానికి డా. సుధాకర్‌ని పిచ్చోడిని చేసి చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. శాండ్‌లో అవినీతి జరుగుతోందని ప్రశ్నించిన ఓం ప్రకాష్‌ను ఉరివేసి చంపేశారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందని తెలిపారు. జగన్ హయాంలో హత్యకు గురైన బీసీ సోదరుడు తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించామని అన్నారు. నేడు మళ్లీ జగన్ కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహించారు. అధికారులకు కులాలు అంటగట్టి దూషిస్తున్నారని మండిపడ్డారు. రోడ్డు ప్రమాదంలో ఓ పాస్టర్ చనిపోతే రాజకీయం చేయాలని చూశారని... వీటన్నింటినీ ప్రజలు గమనించాలని కోరారు. అన్నివర్గాలు సంఘటితమై ముందుకు సాగాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

## పవన్ కళ్యాణ్ ఆరోగ్యంపై కేంద్రమంత్రి ఆరా

### నేరుగా ఫోన్ చేసి పలకరించిన ప్రహ్లాద్ జోషి

అమరావతి,మే19: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోగ్యం గురించి కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి ఫోన్ చేసి ఆరా



తీశారు. ఇటీవల పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కొన్నిరోజుల క్రితం పవన్ కల్యాణ్‌కు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో ముక్కుకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. వైద్యుల సూచన మేరకు ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. 'మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. ఆరోగ్యం అన్నిటికన్నా ముఖ్యం. మీ ఆరోగ్యం బాగుంటేనే ప్రజల కోసం మరింత సమర్థంగా పని చేయగలుగుతారు' అంటూ పవన్ కల్యాణ్‌ను ఫోన్‌లో ప్రహ్లాద్ జోషి పరామర్శించారు. రాజకీయ బాధ్యతలతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకొని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. 'నేను ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినప్పుడు తప్పకుండా మిమ్మల్ని కలుస్తాను' అని డిప్యూటీ సీఎంకు చెప్పారు. అంతేకాకుండా పవన్ ఆరోగ్యం కోసం తాను తిరుపతి బాలాజీని ప్రార్థిస్తున్నానని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.

# ప్రాణాంతకమైన ఎబోలా

మొదటిపేజీ తరువాయి..

ప్రభావితమైన దరఖాస్తుదారులకు సమాచారం అందించింది. డి ఆర్ సి లో ఉన్న ఒక అమెరికన్ సిబ్బందికి ఎబోలా వైరస్ సోకినట్లు డబ్ల్యుహెచ్ ఒ ప్రతినిధి సతీష్ పిళ్ళై ధృవీకరించారు. ఆ వ్యక్తికి పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో, చికిత్స నిమిత్తం జర్మనీకి తరలించేందుకు యత్నిస్తున్నామని అన్నారు. అలాగే అతనితో పరిచయం ఉన్న మరో ఆరుగురిని క్వారంటైన్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రజలకు తక్షణ ప్రమాదం తక్కువగానే ఉందని అంచనా వేస్తున్నామని, అయితే మారుతున్న పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తున్నట్లు సిడిసి తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ వ్యాధి వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం చేస్తూనే, ప్రస్తుతానికి ఇది ఆఫ్రికాకే పరిమితమైందని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ ఎబోలా సంక్షోభంపై ట్రంప్ ప్రభుత్వం స్పందిస్తున్న తీరుపై అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ ఒ) నుండి అధికారికంగా వైదొలగడం, గతంలో ఎబోలా నివారణలో కీలక పాత్ర పోషించిన 'యుఎస్ ఎఐడి' (యుఎస్ ఎఐడి) నిధులలో కోత విధించడం ప్రస్తుత నియంత్రణ ప్రయత్నాలపై ప్రతికూల ప్రభావం చూపిందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం తీసుకుంటున్న ప్రయాణ నిషేధాలు కేవలం నాటకమేనని, ట్రంప్ ప్రభుత్వం ఈ విషయంలో చాలా వెనుకబడి వ్యవహరిస్తోందని జార్జ్‌టౌన్ యూనివర్శిటీ నిపుణులు మాథ్యూ కావనాగ్ విమర్శించారు. గతంలో ప్రభుత్వ ఏజెన్సీల సమన్వయం వల్ల వ్యాధిని వేగంగా అరికట్టగలిగారని, కానీ ఇప్పుడు వందలాది కేసులు నమోదై, తీవ్రంగా వ్యాపించిన తర్వాతే చర్యలు చేపట్టడం అమెరికా వ్యూహాత్మక వైఫల్యమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తాము స్థానిక ఆరోగ్య సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, తక్షణ ప్రతిస్పందన చర్యల కోసం 13 మిలియన్ డాలర్ల సహాయాన్ని సమీకరించినట్లు సిడిసి ప్రకటించింది.

ఆఫ్రికాలోని కాంగో, ఉగాండా సహా పలు దేశాల్లో ఎబోలా వైరస్ వేగంగా విజృంభిస్తోంది. ఈ ప్రాణాంతక వ్యాధి కారణంగా ఇప్పటికే 100 మంది మృతి చెందారు. 390 అనుమానిత కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాంగోలోని ఆరుగురు అమెరికన్లకు ఈ వ్యాధి సోకినట్లు పేర్కొన్నారు. వీరిని క్వారంటైన్ కోసం సురక్షిత ప్రదేశానికి తరలించేందుకు అమెరికా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఎబోలా వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఎబోలా వ్యాప్తిని జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) నిశితంగా గమనిస్తోందని, దేశంలోకి ఈ వ్యాధి ప్రవేశించ కుండా నిఘా పెట్టిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో ఎబోలా వ్యాప్తి లేనప్పటికీ అంతర్జాతీయ ప్రయాణాలు, ప్రపంచ అనుసంధానం కారణంగా భారత్ అంటువ్యాధుల ముప్పు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఢిల్లీలోని ఎయిమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ రాయ్ హెచ్చరించారు. ప్రస్తుతం దేశానికి ఎబోలా ముప్పు తక్కువగానే ఉందని, ఈ వ్యాధి వ్యాప్తిపై ఆందోళన చెందాల్సి అవసరం లేదని ఆయన సూచించారు.

## సభ్యత్వ నమోదుతో సంస్థాగత నిర్మాణం

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

వనపర్తి,మే19(సాక్ష్యం): బీఆర్ఎస్ సభ్యత్వ నమోదుతో సంస్థాగత నిర్మాణం పటిష్టం చేపట్టాలి నాయకులు, కార్యకర్తలు పార్టీకి అంకితమై సభ్యత్వ నమోదు చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం వనపర్తి జిల్లా మాజీ అధ్యక్షుడు గట్టు యాదవ్ అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మన వనపర్తిలో 70వేల 500 సభ్యత్వం జరిగింది. సాకులు చెప్పి సభ్యత్వ నమోదులో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. పార్టీ పట్ల విధేయత, చిత్తశుద్ధి, అంకితభావం ఉన్న కార్యకర్తలకు పార్టీ పదవులలో సముచిత స్థానం కల్పిస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పట్ల స్పందించే నాయకులు నిత్యం ప్రజలలో ఉండే నాయకులే పార్టీ పదవులు వస్తాయని పేర్కొన్నారు. దుష్ప్రచారం వల్ల గత ఎన్నికలో ఓడిపోయాం. కార్యకర్తల శిక్షణనే పార్టీకి శ్రీరామరక్ష, ÷లంగాణ సోయి లేనివాళ్లు నీటి పాలకులుగా ఉండడం దురదృష్టకరమన్నారు. హామీలు విస్మరించిన నాయకులను గల్లా పట్టి నిలదీయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మెట్టు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## లండన్ నుంచి దాగ్దేవి విగ్రహం తెప్పించాలి

భోపాల్,మే19(సాక్ష్యం): మధ్యప్రదేశ్‌లోని భోజ్‌శాల స్థలం వాగ్దేవి ఆలయానికే చెందుతుందని ఆ రాష్ట్ర హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో అక్కడ తాత్కాలికంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. ఈ క్రమంలో లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న వాగ్దేవి మాత (సరస్వతీ దేవి) విగ్రహాన్ని భారత్‌కు తిరిగి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పలు హిందూ సంఘాలు స్థానిక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. అది తమకు కోహినూర్ కంటే ముఖ్యమైనదని అందులో పేర్కొన్నాయి. మరోవైపు, ఇదే అంశంపై కేంద్ర ప్రభుత్వం, పురావస్తు శాఖతోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి హిందూ సంఘాలు లేఖ రాశాయి. ఈ విగ్రహాన్ని తాము కోహినూర్ కన్నా ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తున్నామని పిటిషనర్లలో ఒకరైన కుల్‌దీప్ తివారీ పేర్కొన్నారు. ఇది సాంస్కృతిక వారసత్వంతో పాటు మత విశ్వాసంతో ముడిపడి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం దౌత్య ప్రయత్నాలు మొదలుపెడితే బ్రిటన్ నుంచి తిరిగి తీసుకురావడం కష్టమైన పని కాదన్నారు. రాజ్‌పుత్‌లకు చెందిన పర్మార్ వంశ భోజ్ రాజు 1034లో ఇక్కడ సరస్వతీ ఆలయాన్ని నిర్మించినట్లు చారిత్రక ఆనవాళ్లు చెబుతున్నాయి. 1305లో మాల్వా ప్రాంతంపై అల్లావుద్దీన్ ఖిల్జీ దండెత్తినప్పుడు ఈ ఆలయం ధ్వంసం చేశారు. తదనంతరం దీనిని దర్గాగా మార్చారు.

# పర్యావరణహితంగా అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి..

దిశగా ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని, ఇందులో కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్ రీజియన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌ల సమతుల్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఇకపై కేవలం చెత్త సేకరణకు పరిమితం కాదని, అది వాతావరణ మార్పులకు ప్రతిస్పందన, పర్యావరణ సుస్థిరత, సర్క్యులర్ ఎకానమీ, ఉపాధి కల్పన, ఆర్థిక ఉత్పాదకతలతో నేరుగా అనుసంధానమై ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో



మంగళవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల 'స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0' జాతీయ సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్రం తరపున ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు హాజరయ్యారు. మొదటి రోజు సమావేశంలో దేశంలోని పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్, పాత చెత్త కుప్పల తొలగింపు, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, పీపీపీ విధానాలు, కొత్త ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రాలు, నగరాలు అమలు చేస్తున్న అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు, సుస్థిర పట్టణాభివృద్ధి చర్యలు, స్వచ్ఛత కార్యక్రమాలు, సర్క్యులర్ ఎకానమీ దిశగా చేపడుతున్న కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి సమావేశంలో వివరించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026 దేశంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలో కీలక మార్పుకు దారితీస్తున్నాయని తెలిపారు.

కొత్త నిబంధనలు సంప్రదాయ చెత్త సేకరణ, డంపింగ్ విధానాలకే పరిమితం కాకుండా, 4-వే సోర్స్ సెగ్రిగేషన్, వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్, పాత డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, సర్క్యులర్ ఎకానమీ, వార్డు స్థాయి బాధ్యత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఈ దిశగా నిబంధనలు అమలులోకి రాకముందే పలు చర్యలు ప్రారంభించిందని వివరించారు. రాష్ట్రంలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో దాదాపు 9,596 ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లను ప్రవేశపెట్టే పక్రియను తెలంగాణ ప్రభుత్వం చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ వాహనాల ద్వారా మున్సిపల్ కార్యకలాపాల్లో కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు, శుభ్రమైన రవాణా విధానానికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. వీటిని 4-వే సోర్స్ సెగ్రిగేషన్‌కు అనుగుణంగా విభజిత చెత్త నిల్వ స్థలాలతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఖీఖీ కోడ్ ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వికేంద్రీకృత, పంపిణీ ఆధారిత వ్యర్థాల ప్రాసెసింగ్ వ్యవస్థలకు ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తడి చెత్తను ఉత్పత్తి అయిన ప్రాంతాల సమీపంలోనే ప్రాసెస్ చేయడం, పొడి చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి రీసైక్లింగ్ మరియు సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థల్లోకి తీసుకురావడం, ల్యాండ్‌ఫిల్ ప్రాంతాలకు కనిష్ట వ్యర్థాలు మాత్రమే చేరేలా చేయడం ప్రభుత్వ విధానమని వివరించారు. తడి చెత్తను నగరాల్లో దూర ప్రాంతాలకు తరలించడం వ్యయభారంతో కూడుకున్నదిగా ఉండటమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కూడా సుస్థిర విధానం కాదని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అందుకే వికేంద్రీకృత తడి చెత్త ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా స్థానిక స్థాయిలోనే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిన అంశమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంప్ యార్డ్ విషయంలో ఐఐటీ బాంబే సాంకేతిక సహకారం, సలహా సేవలను పొందుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. దీని లక్ష్యం మొక్కుబడి చర్యలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక పర్యావరణ నిర్వహణ వ్యూహాన్ని రూపొందించడం, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడమని పేర్కొన్నారు. అలాగే ఆటోనగర్ డంప్ సైట్‌లో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 22 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా ప్రాసెస్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 30 శాతం వ్యర్థాలు ప్రాసెస్ అయ్యాయని వివరించారు. స్వాధీనం చేసుకున్న భూమిని మళ్లీ డంపింగ్ కోసం కాకుండా, భవిష్యత్తులో పార్కులు, క్రీడా సదుపాయాలు, ప్రజా వినియోగ మౌలిక సదుపాయాలుగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన?ప్రగతి ప్రణాళిక కింద పట్టణ స్థానిక సంస్థలు, జిల్లా యంత్రాంగాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

కార్యక్రమాలు విడివిడిగా చేపట్టిన పారిశుద్ధ్య చర్యలు కాదని, తెలంగాణ విజన్?2047కు అనుగుణంగా పట్టణాల సమ్మిళిత అభివృద్ధికి దోహదపడే సమగ్ర కార్యాచరణలో భాగమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. జపాన్ దేశంలో ని కిటాక్యుషు నగర అభివృద్ధి మోడల్ ఆధారంగా బండరావిర్యాల, సిద్దాపూర్ ప్రాంతాల్లో ప్రతిపాదించిన ఎకో టౌన్ తెలంగాణ సర్క్యులర్ ఎకానమీ ప్రయాణంలో ముఖ్యమైన ముందడుగని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను 30?35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో, తెలంగాణ రాష్ట్రం తన 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ సహా జాతీయ పరిశుభ్రత, పట్టణ పారిశుద్ధ్య ర్యాంకింగ్స్‌లో తెలంగాణ రాష్ట్రం నిరంతరం మెరుగైన ప్రదర్శన కనబరుస్తోందని, ఇది పౌరులు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక సంస్థలు, ప్రభుత్వం కలిసి చేస్తున్న కృషికి నిదర్శనమని తెలిపారు. పరిశుభ్రత అనేది కేవలం నగరాల రూపురేఖలకు సంబంధించిన విషయం మాత్రమే కాదని, అది ప్రజారోగ్యం, మానవ గౌరవం, జీవన ప్రమాణాలతో ముడిపడి ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. వ్యర్థాల నిర్వహణను పారిశుద్ధ్య కార్యక్రమంగా మాత్రమే కాకుండా, ఆర్థిక విలువ సృష్టించే ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రత ప్రజల జీవనశైలిలో భాగం కావాలంటే చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

జపాన్ తరహాలో మొదటి తరగతి నుంచే పాఠశాలల్లో పరిశుభ్రత, వ్యర్థాల వేర్పాటు, పర్యావరణ బాధ్యత వంటి అంశాలను ఆచరణాత్మకంగా బోధించే అంశాన్ని అన్ని రాష్ట్రాలు పరిశీలించాలని ఆయన సూచించారు. ప్రజలు, స్థానిక సంస్థలు, పారిశుద్ధ్య కార్మికులు, పరిశ్రమ భాగస్వాములు, వివిధ సంస్థల సహకారంతో తెలంగాణ సుస్థిర పట్టణ నిర్వహణ, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, సర్క్యులర్ ఎకానమీ అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు, కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీనివాస్ కటికితల,స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ రూపా మిశ్రా లతో సహా సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులు, తెలంగాణ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మానిక్ రాజ్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు వివిధ రాష్ట్రాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్ కేర్ ట్రస్ట్

మొదటిపేజీ తరువాయి..

సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. ఫైనాన్స్ శాఖ సూచనల ప్రకారం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను తప్పనిసరిగా సమర్పించాలి. భార్య, భర్త, పిల్లలు, ఆధారపడిన కుటుంబ సభ్యుల వివరాలు కూడా నమోదు చేయాలని స్పష్టం చేసింది. ఈ సమాచారం భవిష్యత్తులో ఆరోగ్య సేవలు, క్యాష్‌లెస్ చికిత్స వంటి ప్రయోజనాల అమలుకు ఉపయోగ పడనుంది. అన్ని శాఖల అధికారులు ఉద్యోగుల వివరాలను పోర్టల్‌లో మే 31వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులోపు సమాచారం నమోదు చేయని పక్షంలో భవిష్యత్తులో ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమల్లో ఉన్న వైద్య పథకాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కొత్త విధానాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త హెల్త్ స్కీమ్‌తో ఉద్యోగులు, పెన్షనర్లు అత్యవసర వైద్య సేవలను సులభంగా పొందుతారని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాయి. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# వీధికుక్కలను తరలించాల్సిందే

మొదటిపేజీ తరువాయి..

జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గతంలో జారీ చేసిన ఆ ఉత్తర్వులను సవరించాలని చేసిన విజ్ఞప్తిని కూడా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. స్కూల్, కాలేజీ, రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర బహిరంగ ప్రదేశాల్లో కుక్కలను తొలగించాలంటూ జంతు ప్రేమికులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం విచారించింది. ఈ సందర్భంగా జంతు సంక్షేమ బోర్డు దాఖలు చేసిన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా తన తీర్పులో.. పలు కీలక అంశాలను సుప్రీంకోర్టు ప్రస్తావించింది. వీధి కుక్కల సమస్యను జంతు సంక్షేమ అంశంగా కాకుండా ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించాలని పిటిషనర్లకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా రూపొందించిన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయడం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. ప్రతి




జిల్లాలో కనీసం ఒక పూర్తి స్థాయి యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. జనాభాను దృష్టిలో ఉంచుకొని అవసరమైతే జిల్లాలో ఈ కేంద్రాల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రజల భద్రత దృష్టిలో ఉంచుకుని స్కూళ్లు, కాలేజీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లతోపాటు ఇతర ప్రదేశాల్లో కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా యాంటీ రేబిస్ మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. రహదారులపై సంచరించే పశువుల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జాతీయ రహదారులపై తిరిగే జంతువుల సమస్యల పర్యవేక్షణ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్‌ఏఐను కోరింది. రేబిస్ బారిన పడిన లేదా మానవుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించే ప్రమాదకర కుక్కల విషయంలో చట్టబద్ధంగా అనుమతించిన చర్యలు తీసుకోవచ్చని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల అమలు కోసం విధులు నిర్వహించే ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వాలకు సూచించింది. విధులు నిర్వర్తించే క్రమంలో వారిపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు.. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు

## అధికారులతో సమీక్షించిన ప్రత్యేక ప్రధానకార్యదర్శి

హైదరాబాద్,మే19(సాక్ష్యం): జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం డా.బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ముందుగా గన్ పార్క్ ను సందర్శించి తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించిన అనంతరం పరేడ్ గ్రౌండ్ వేడుకల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్, గన్ పార్కు వద్ద చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ వేడుకల ఏర్పాట్లపై ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారి నియమించి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా పరేడ్ గ్రౌండ్ కు వచ్చే వాహనాలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు. వాటర్ ప్రూఫ్ షామియానాలు, బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ తోపాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను ఆయన ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా, జనరేటర్ , నగరంలోని ప్రముఖ ప్రదేశాలైన అసెంబ్లీ, రాష్ట్ర సచివాలయం, చార్మినార్, ప్రజాభవన్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్లు చేయాలని సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ నెల 25వ తేదీ నుంచి పరేడ్ గ్రౌండ్ వద్ద అన్ని విభాగాలు సంయుక్తంగా రిహార్సల్స్ చేపట్టాలని ఆదేశించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నవీన్ మిట్టల్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, కార్యదర్శి రఘునందన్ రావు, డిజిపి మహేశ్ భగవత్, ఎడిజి(ఇంటలిజెన్స్) విజయ్ కుమార్, టిజి జెన్కో సిఎండి హరీష్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## అక్రమ గుడుంబా తయారీ కేంద్రాలపై పోలీస్, ఎక్సైజ్ శాఖల దాడులు

- 30 గుడుంబా తయారీ స్థావరాలపై దాడులు చేసి 3000 లీటర్ల గుడుంబా పానకం ధ్వంసం







**మంచిర్యాల జిల్లా (సాక్ష్యం)మే 19:** చెన్నూర్ పరిధిలో అక్రమ గుడుంబా తయారీ, విక్రయాలను అరికట్టేందుకు మంగళవారం రోజు నీల్వాయి ఎస్సై ఆధ్వర్యంలో,చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ గారి సమక్షంలో,చెన్నూర్ ,బెల్లంపల్లి ఎక్సైజ్ ఎస్సైలు, ఎక్సైజ్ సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి బుయ్యారం గ్రామంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామ పరిసర ప్రాంతాల్లో గుర్తించిన 30 గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. అక్కడ నిల్వ ఉంచిన సుమారు 3000 లీటర్ల పులియబెట్టిన బెల్లం పానకం (గుడుంబా పానకం)ను 25 డ్రమ్‌లలో స్వాధీనం చేసుకుని ,సంఘటనా స్థలంలోనే ధ్వంసం చేశారు.అనంతరం సీఐ గ్రామస్థులతో సమావేశమై అక్రమంగా గుడుంబా తయారీ,విక్రయం చేయడం చట్టరీత్యా నేరమని అవగాహన కల్పించారు.ఇలాంటి కార్యకలాపాలలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, గుడుంబా తయారీ లేదా, విక్రయంలో ఎవరైనా పాల్గొన్నట్లు గుర్తిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ప్రజలు అక్రమ మద్యం తయారీ, వినియోగానికి దూరంగా ఉండాలని, గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్,ఎక్సైజ్ అధికారులు మరియు సిబ్బంది సుమారు 40 మంది పాల్గొన్నారు.

## హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ జనరల్ మేనేజర్‌పై అక్రమాస్తుల కేసు నమోదు

- ఏసీబీ దాడుల్లో భారీగా నగదు, బంగారం, స్థిరాస్తుల గుర్తింపు





**ఉప్పల్, మే 19 (సాక్ష్యం):** హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ప్రాజెక్ట్ డివిజన్--ఎ×××, రెడ్ హిల్స్‌కు చెందిన జనరల్ మేనేజర్ (ఇంజినీరింగ్) ఎస్.ఏ.ఎల్. కుమార్ (సగ్గం అనంత లక్ష్మీ కుమార్)పై ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన ఆరోపణలతో తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు నమోదు చేసింది. ఏసీబీ అధికారులు మంగళవారం ఆయన నివాసంతో పాటు బంధువులు, స్నేహితులు, బినామీలు మరియు ఇతర అనుబంధ వ్యక్తులకు చెందిన మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో 18 ఎకరాల వ్యవసాయ భూములు, ఆరు ఓపెన్ ప్లాట్లు, మూడు ఫ్లాట్లు, హైదరాబాద్‌లో ఒక ఇల్లు ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా, రూ.1.10 కోట్ల నగదు, సుమారు 2.1 కిలోల బంగారు ఆభరణాలు, 9.2 కిలోల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒక మారుతి రిట్జ్ కారు, ఒక బజాజ్ మోటార్ సైకిల్‌ను కూడా అధికారులు గుర్తించారు. ఈ సోదాల్లో ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ సుమారు రూ.5.88 కోట్లుగా అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే మార్కెట్ విలువ పత్రాల్లో చూపిన విలువ కంటే మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరిన్ని ఆస్తులపై విచారణ కొనసాగుతోందని, కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉందని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

## శ్రీ రంగనాథ స్వామి దేవాలయ చైర్మన్‌గా గోషికొండ శకుంతల సుధాకర్






**వరంగల్ 19 మే (సాక్ష్యం)** కాశీబుగ్గ శ్రీ రంగనాథ స్వామి దేవాలయంలో తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ, మాజీ ఏమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ఆదేశాల మేరకు దేవాదాయ ఉప కమీషనర్ రాముల సునీత ఉత్తర్వుల మేరకు మంగళవారం దేవాలయ ఇఓ వెంకట్రావ్ మరియు దేవాదాయ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ ల ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తలుగా గోషికొండ శకుంతల సుధాకర్, నీలం అరుణ శ్రీనివాస్, పల్లకొండ రాజమణి రమేష్, మెడికుర్తి లోకేష్, పిట్టల కోటి, ఆలయ పురోహితుడు ఆరుట్ల కృష్ణమచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు. తదుపరి ఆలయ ధర్మకర్తలందరు గోషికొండ శకుంతల సుధాకర్ ను ఆలయ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీ రంగనాథస్వామి దేవాలయం చైర్మన్ గా ఎన్నికైన గోషికొండ శకుంతల సుధాకర్ మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన మంత్రి కొండా సురేఖ, మాజీ ఏమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్ రాజ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రంగనాథస్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని, భక్తులకు తగు సౌకర్యాలు కల్పించేందుకు పాటుపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, దేవాదాయ శాఖ అధికారులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## స్వామివారిని దర్శించుకున్న ప్రిన్సిపల్ సెక్రటరీ



**యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్...** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్న శ్రీనివాసరాజు ప్రిన్సిపల్ సెక్రటరీ టు సీఎం వీరు ఆలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొని అనంతరం ఆలయ ముఖమంటపంలో వేద పండితులు, అర్చకులు వేద ఆశీర్వచనం చేసి అక్షింతలు అందజేయగా ఆలయ ఈవో భవాని శంకర్ స్వామి వారి చిత్రపటాన్ని, లడ్డు ప్రసాదం అందజేశారు.

# కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్









**ఆర్మూర్, సాక్ష్యం న్యూస్ మే 19:** విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నిజాంబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ గ్రామ శివారులో గల భీమన్న కళ్యాణ మండపంలో జరిగిన ఆదివాసి నాయకపోడ్ విద్యార్థుల ప్రతిభ పురస్కారాల సన్మాన కార్యక్రమం మానికి ముఖ్య అతిథులుగా హాజరై ఆయన ప్రసంగించారు. నిజామాబాద్ జిల్లా ఆదివాసి నాయకపోడ్ ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో, జిల్లా ఆదివాసి నాయకపోడ్ సేవా సంఘం సహకారంతో నిర్వహించిన, ఈ కార్యక్రమానికి జిల్లా ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్షుడు శ్రీ పుట్ట రాజేశ్వర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతి , ఇంటర్మీడియట్, ఉన్నత చదువుల్లో ( ఎంబిబిఎస్ ) ఫిజియోథెరపీ, ఎల్ ఎల్ ఎం ) లలోఉత్తమ ప్రతిభ కనబరిచిన సుమారు 100 మంది విద్యార్థి విద్యార్థినులను మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సభకు హాజరైన పలువురు మాట్లాడుతూ విద్యార్థులలక్ష్యాన్ని పెద్దగా ఎంచుకొని దానికి అనుగుణంగా ప్రణాళిక బద్ధంగా చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. ప్రతిభ ఏ ఒక్కరి సొత్తు కాదని కష్టపడితే ప్రతి ఒక్కరూ ప్రతిభావంతులేనని వారు పేర్కొన్నారు.విద్యార్థులను ప్రోత్సహించడానికి ఇలాంటి ప్రతిభ పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా శుభపరిణామ మన్నారు. విద్యార్థులు ఇప్పటి నుంచే ఒక స్పష్టమైన ప్రణాళికతో కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలి. ప్రస్తుత తరం పిల్లలకు ప్రభుత్వాలు, సమాజ పెద్దలు అన్ని విధాలా అండగా ఉంటున్నారు. మనం సివిల్స్ లాంటి పెద్ద లక్ష్యాలను టార్గెట్ చేసుకుంటే, కనీసం గ్రూప్-1 ఆఫీసర్లుగానైనా స్థిరపడ వచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా నిజామాబాద్ జిల్లా డిఆర్డిఏ పీడీ సాయన్న,, జిల్లా అధ్యక్షులు గాండ్ల రాంచందర్, సీనియర్ హైకోర్టు న్యాయవాది రాచమల్లు ప్రశాంత్, తదితరులు పాల్గొని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు.

**బహుమతుల ప్రధానం:**

ఆదివాసి నాయకపోడ్ నిజామాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షులు, ప్రముఖ విజయలక్ష్మి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ బండారి భోజన్న ప్రతిభ కనబరిచిన మొత్తం 10 మంది విద్యార్థులకు తన సొంత ఖర్చులతో నగదు బహుమతులను ప్రధానం చేశారు. మొదటి బహుమతిగా పదివేల రూపాయలు, రెండవ బహుమతిగా ఎన్ని వేల రూపాయలు, తృతీయ బహుమతిగా 5000 రూపాయలు నగదు బహుమతులను విద్యార్థులకు అందజేశారు.

## "డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వంలో అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న మెదక్"

- "ప్రజా సేవలో కొత్త చరిత్ర సృష్టిస్తున్న మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ రావు"
- "ఒకప్పుడు వెనుకబడిన మెదక్.. నేడు అభివృద్ధి, సంక్షేమానికి ఆదర్శంగా మారుతోంది"
- "ఎంఎస్ఎస్ఓ సేవలతో వేలాది కుటుంబాలకు అండగా నిలుస్తున్న ప్రజానాయకుడు రోహిత్ రావు"



**మెదక్ జిల్లా ప్రతినిధి ( సాక్ష్యం న్యూస్) 19 మే** మైనాంపల్లి రోహిత్ రావు ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తూ మెదక్ నియోజకవర్గ ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ... ఎమ్మెల్యేగా మాత్రమే కాకుండా మీరూ (మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్) ద్వారా కూడా నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఆయన నాయకత్వంలో మెదక్ నియోజకవర్గం వేగంగా అభివృద్ధి దిశగా పయనిస్తోంది. ఈ రోజు మెదక్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు... ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొని పలువురు లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన పర్యటన సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రజలు ఘన స్వాగతం పలికారు. యువత, మహిళలు, రైతులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమాన నాయకుడిపై అపారమైన ప్రేమాభిమానాలు వ్యక్తం చేశారు.రామాయంపేట మండలంలో 22 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపశమనాన్ని కలిగించింది. లబ్ధిదారులు మాట్లాడుతూ... "డాక్టర్ రోహిత్ రావు పేదల కష్టాలను అర్థం చేసుకుని వెంటనే స్పందించే నాయకుడు" అని ప్రశంసించారు.అలాగే నిజాంపేట్ మండలంలో మరో 12 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ... "ఇలాంటి ప్రజా నాయకులు రాజకీయాల్లో చాలా అరుదు. ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి సహాయం చేస్తున్న నాయకుడు రోహిత్ రావు" అని కొనియాడారు.ఈ సందర్భంగా నిజాంపేట్ మండలంలోని రాంపూర్ గ్రామంలో తన సొంత నిధులతో ఒక కిచెన్ షెడ్ మరియు రెండు టాయిలెట్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని ఎంతో అభినందిస్తూ... "మాటలు కాదు... పనులతో ప్రజల మనసులు గెలుచుకుంటున్న ఎమ్మెల్యే" అని పేర్కొన్నారు.మస్లక్ మరియు నందగోకుల్ గ్రామాల్లో రెండు బోర్‌వెల్‌లను ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య నుంచి ఉపశమనం కల్పించారు. సంవత్సరాలుగా ఎదురవుతున్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించారని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.ఇక నిజాంపేట్ మండల కేంద్రంలో మరో కిచెన్ షెడ్ మరియు ఆరు టాయిలెట్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ మొత్తం అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలకు సుమారు రూ.1.20 కోట్ల వ్యయం జరిగినట్లు సమాచారం. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు తెలంగాణ రాష్ట్రంలో అత్యంత చురుకైన మరియు అభివృద్ధి దృక్పథం కలిగిన ప్రజానాయకుల్లో ఒకరిగా ఎదుగుతున్నారు. గ్రామీణాభివృద్ధి, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్యం, వైద్య సహాయం, పేదల సంక్షేమం వంటి రంగాల్లో ఆయన చేస్తున్న సేవలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయి. ఎంఎస్-ఎస్ఓ ద్వారా వేలాది కుటుంబాలకు వివిధ రకాల సహాయ కార్యక్రమాలు అందుతున్నాయి. పేద విద్యార్థులకు సహాయం, అత్యవసర వైద్య సేవలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మ్సో ప్రజలకు ఆశాకిరణంగా మారింది. ఒకప్పుడు అభివృద్ధికి దూరంగా ఉన్న మెదక్... నేడు డాక్టర్ రోహిత్ రావు నాయకత్వంలో వేగంగా ముందుకు సాగుతోంది. రోడ్లు, తాగునీటి ప్రాజెక్టులు, గ్రామీణ మౌలిక వసతులు, ప్రజా సంక్షేమ పథకాల అమలు వంటి కార్యక్రమాలతో మెదక్ రూపురేఖలు మారుతున్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో ముందుకు సాగుతూ మెదక్‌ను తెలంగాణలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో డాక్టర్ రోహిత్ రావు పనిచేస్తున్నారని స్థానిక ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఆయన నాయకత్వంలో మెదక్ మరింత అభివృద్ధి సాధిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో రామాయంపేట మరియు నిజాంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రతి ప్రాంతంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం లభించగా... ప్రజలు ఆయన సేవలను ప్రశంసిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## మండలంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ - ఎమ్ఎస్ ఎస్ ఓ ద్వారా టాయిలెట్స్ కిచెన్ షెడ్లకు భూమి పూజ
నిజాంపేట మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తాబి ఎమ్మెల్యే రోహిత్ రావు



**మెదక్ జిల్లా ప్రతినిధి ( సాక్ష్యం న్యూస్) 19 మే** మండల పరిధిలోని రాంపూర్, నస్కల్, నందగోకుల్, నిజాంపేట్, గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, ఆయనకు మండల కాంగ్రెస్ నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం మండల కేంద్రంలోని వైశ్య భవన్ లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు పంపించేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాంపేట మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానన్నారు. నస్కల్ , నంద గోకుల్ , గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా బోరు మోటర్ రాను ఫిట్ చేయడం జరిగింది అన్నారు. ఎండాకాలంలో నీటి ఎద్దడి రాకుండా మా సంస్థ ద్వారా బోర్లు వేయించి మోటార్లను ఫిట్ చేయడం జరుగుతుందన్నారు. పాఠశాలలో టాయిలెట్స్ లేక కిచెన్ షెడ్లు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉపాధ్యాయులు తెలపడంతో వెంటనే ఎం ఎస్ ఎస్ ద్వారా రాంపూర్ పాఠశాలకు సొంత నిధులతో 35 లక్షల రూపాయలతో టాయిలెట్స్ కు కిచెన్ షెడ్డు కు భూమి పూజ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా నిజాంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 40 లక్షల రూపాయలతో టాయిలెట్స్ కిచెన్ షెడ్డు నిర్మించడం జరుగుతుందన్నారు. మండలంలో ఎక్కడైనా పాఠశాలల్లో ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కట్టించడానికి సిద్ధంగా ఉన్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు భాను ప్రకాశ్ రెడ్డి, రామాయంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అమర సేనా రెడ్డి, రామాయంపేట మున్సిపల్ చైర్మన్ రాజు సెట్, దేమే యాదగిరి, రమేష్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రామచంద్రనాయక్, మాజీ ఎంపీపీ సిద్ధిరాములు, మాజీ పట్టణ అధ్యక్షులు నజీరుద్దీన్, వివిధ గ్రామాల సర్పంచులు ఉపసర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత అమరజీవి కామ్రేడ్ సుందరయ్య

– నిరాడంబర జీవనానికి ప్రతీక – కార్మిక, రైతాంగ హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానేత: సిపిఎం నాయకులు



**పాలకుర్తి 19మే (సాక్ష్యం):** దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత అమరజీవి కామ్రేడ్ సుందరయ్యని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల సోమన్న మండల కార్యదర్శి మాచర్ల సారయ్య అన్నారు.మంగళవారం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో సుందరయ్య 41 వర్ధంతిని పురస్కరించుకొని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల స్మారక స్థూపం వద్ద సిపిఎం పాలకుర్తి మండల కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. విప్లవోద్యమ యోధుడు నిరాడంబర జీవనానికి పత్రిక. కార్మిక, రైతాంగ హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానేత సమా సమాజ నిర్మాణం కోసం ఆయన చూపిన మార్గం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని వారు అన్నారు, చిన్న వయసులోని సమాజంలోని అసమానతలను గమనించిన ఆయన కుల వ్యవస్థను వ్యతిరేకిస్తూ తన పేరులోనే రెడ్డి అనే కుల సూచికను తొలగించుకున్నారని, భూస్వామ్య కుటుంబంలో పుట్టి పేదల పక్షాన నిలిచిన నాయకుడు సుందరయ్యని వారు అన్నారు, వారి వాటా కొచ్చిన ఆస్తిని పేద ప్రజలకు పంచారని కుల దోపిడిని తన ఇంటి నుండే అరికట్టి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నినదించాడన్నారు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించాడని కొనియాడారు, సమాజ శ్రేయస్సు కోరి పార్టీ ప్రజల అభ్యున్నతి కొరకు సంతానం కలిగితే స్వార్థం పెరుగుతుందన్న ఆలోచనతో లీలా సుందరయ్య వివాహమాడిన వెంటనే కుటుంబ నియంత్రణ పాటించిన మహోన్నత మహనీయుడని తెలిపారు, ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సోమసత్యం, ఏదునూరి మదార్, సిపిఎం సీనియర్ నాయకులు సోమ అశోక్ బాబు, వివిధ గ్రామాల నాయకులు కౌడగాని మల్లేష్, తోటకూరి నరసయ్య, ఆర్ రమేష్, రాజు, బోడియ నాయక్, దిక్కు, రాజేష్, రమేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రమశక్తి అవార్డు గ్రహీత చిప్ప వెంకటేశ్వర్లు నేతను సన్మానించిన కొత్తవాడ వాకర్స్ అసోసియేషన్



**వరంగల్ 19 మే (సాక్ష్యం)** గోపాల్ స్వామి గుడి తోట మైదానం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈరోజు శ్రమశక్తి అవార్డు తెలంగాణ ప్రభుత్వం ద్వారా పొందిన చిప్ప వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మరియు పరపతి సంఘ అధ్యక్షులు కార్యదర్శులు మాట్లాడుతూ ప్రజల పక్షాన ఉంటూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్న చిప్ప వెంకటేశ్వర్లు ను ప్రభుత్వం గుర్తించి అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉందని మా ప్రాంతానికి పేరు తెచ్చిన మాలో ఒక్కడు ఐన చిప్ప వెంకటేశ్వర్లును అభినందించడం ఆనందంగా ఉందని అన్నారు. గోపాల స్వామి గుడి తోట మైదానం విషయంలో మీ వంతు సహాయ సహకారాలు ఉండాలని శ్రమశక్తి అవార్డు గ్రహీతను కోరారు.చిప్ప వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎల్లవేళలా ప్రజలతో మమేకమై ప్రజల పక్షాన నిలబడుతూ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ మురళీధర్ రావు ఆదేశానుసారం ముందుకు సాగుతానని మరియు గోపాల స్వామి గుడి తోట మైదానంలో ఉన్న సమస్యలను నా వంతు బాధ్యతగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గిరి వేణి సారయ్య, కార్యదర్శి మద్రి వెంకటేశ్వర్లు, పులి సుదర్శన్, మాజీ అధ్యక్షులు గరిదాసు జయప్రకాష్,, పనికిరా సత్యనారాయణ, సిరబోయిన రాజు, అంజయ్య యాదవ్, చిప్ప ఐలయ్య, కోటేశ్వర్, రాజు, ఆనంద్, ప్రభాకర్, రాజలింగం, సూర్యనారాయణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు విద్యుత్ ఏర్పాట్లు పూర్తి

– లక్షలాది భక్తులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా లక్ష్యం

– టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్



**(సాక్ష్యం) న్యూస్ జయశంకర్ – భూపాలపల్లి, మే 19 :** సరస్వతి అంత్య పుష్కరాల ఈ నెల 21వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న సందర్భంగా అన్ని విద్యుత్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 330 ఎనిమిది మీటర్ల స్తంభాలు, 152 తొమ్మిది మీటర్ల స్తంభాలు, 8 పదకొండు మీటర్ల స్తంభాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా సుమారు 5 కి.మీ. 11 కేవీ లైన్, 12 కి.మీ. ఎల్‌టీ లైన్ వేయడం పూర్తయినట్లు వెల్లడించారు. మొత్తం 18 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిరంతరాయ విద్యుత్ సరఫరా నిర్వహణ కోసం 16 కీలక ప్రాంతాలలో 12 రోజుల పాటు రౌండ్ ది క్లాక్ పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. విధుల్లో 4 మంది డివిజనల్ ఇంజినీర్లు, 6 మంది అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు, 13 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు, 12 మంది సబ్ ఇంజినీర్లు, 13 మంది లైన్ ఇన్స్పెక్టర్లు, 9 మంది లైన్మెన్లు, 45 మంది అసిస్టెంట్ లైన్మెన్లు తదితర సిబ్బంది కలిపి మొత్తం 150 మంది విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు విఫలమైన సందర్భంలో వెంటనే మార్పిడి చేయడానికి అదనపు స్పేర్ ట్రాన్స్‌ఫార్మర్లను కూడా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. దేవాలయం, టెంట్ సిటీ, వీఐపీ ఘాట్, మెయిన్ ఘాట్, హరిత హోటల్ తదితర కీలక ప్రాంతాలకు డబుల్ ఫీడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన

## తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య





**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్.** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని లిప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆలేరు నియోజజవర్గంలోని ఎనిమిది మండలాలకు సంబంధించిన 323 మంది లబ్ధిదారుల చెక్కులను స్వయంగా బీర్ల అయిలయ్య పంపిణీ చేశారు. బొమ్మలరామారం 37, తుర్కపల్లి 42 యాదగిరిగుట్ట మండలం,పట్టణం,61ఆలేరు 22,మూట కొండూరు 28ఆత్మకూరు 39,రాజపేట 31,గుండాల 29మిగతావి 35, మొత్తం...323 ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలనకు కొత్త అర్థం తీసుకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నాయకత్వంలో ప్రతి సంక్షేమ పథకాన్ని పారదర్శకంగా ప్రజలకు అందిస్తోందన్నారు. మధ్యవర్తులు, పైరవీలు, కమిషన్లకు తావులేకుండా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సహాయం నేరుగా అందేలా చర్యలు కొనసాగుతున్నాయన్నారు. పెన్షన్, రేషన్ కార్డు, సీఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల కోసం ఎవరైనా డబ్బులు అడిగినా, కిరాయిల పేరుతో ఇబ్బంది పెట్టినా వెంటనే అధికారులకు లేదా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తూ, పారదర్శక పాలనతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని బీర్ల అయిలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సైమ' ఎన్‌ఆర్‌ఐ సెల్ అధ్యక్షురాలిగా గోలి నవ్య రెడ్డి నియామకం



**అట్లాంటా (అమెరికా), మే 17:** సౌత్ ఇండియా మీడియా అసోసియేషన్ (సైమ) అంతర్జాతీయ ఎన్‌ఆర్‌ఐ సెల్ అధ్యక్షురాలిగా అట్లాంటాకు చెందిన ప్రముఖ ప్రవాస భారతీయురాలు, తెలంగాణలోని నల్లగొండ జిల్లా వాస్తవ్యులు గోలి నవ్య రెడ్డి నియమితులయ్యారు. అమెరికాలోని అట్లాంటా నగరంలో ఆదివారం ఘనంగా జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో 'సైమ' ఫౌండర్ ప్రెసిడెంట్ నకిరేకంటి స్వామి ఆమెకు అధికారికంగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ ప్రెసిడెంట్ నకిరేకంటి స్వామి మాట్లాడుతూ.. 'సైమ' కార్యకలాపాలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడమే ప్రధాన లక్ష్యంగా ఈ ఎన్‌ఆర్‌ఐ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నవ్య రెడ్డి నేతృత్వంలో ఈ విభాగం అంతర్జాతీయ స్థాయిలో బలోపేతం అవుతుందని, ఆమె తన వృత్తిపరమైన అనుభవంతో బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. తమపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలను అప్పగించినందుకు గోలి నవ్య రెడ్డి 'సైమ' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సౌత్ ఇండియన్ మీడియా ప్రతినిధులను, ప్రవాస భారతీయులను ఒకే తాటిపైకి తెస్తూ అసోసియేషన్ ఆశయాల సాధనకు శరవేగంగా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అమెరికాలోని పలువురు ప్రవాస భారతీయులు, ప్రముఖులు, మీడియా ప్రతినిధులు పాల్గొని నవ్య రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో

# 365 రోజుల నిత్య అన్నదాన కార్యక్రమం

ప్రారంభించిన భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు



**(సాక్ష్యం) న్యూస్ రేగొండ, మే 19 :** ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో 365 రోజుల నిత్య అన్నదాన కార్యక్రమాన్ని భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయం కొడవటంచ లో భూపాలపల్లి జిల్లా ఆర్య వైశ్యులు రేగొండ ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో 365 రోజుల నిత్య అన్నదాన కార్యక్రమాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమశీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ .. నిత్య అన్నదానం ద్వారా దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎంతో ఉపశమనం కలుగుతుందని, అలాగే దేవాలయానికి వచ్చే భక్తుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. దేవాలయ అభివృద్ధికి ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ చైర్మన్ ఎన్ఎస్ఆర్, ఆర్య వైశ్య సంఘం సభ్యులు, భూపాలపల్లి మార్కెట్ చైర్మన్ గుతొజు కిష్టయ్య,మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య,దేవాలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పోస్ట్ మార్టమ్ సౌకర్యం కల్పించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ డిమాండ్

– కలెక్టర్ సార్ మీరైనా స్పందించండి – పాలకులు మారిన ప్రజల కష్టాలు మారలేదు

– పోస్ట్ మార్టమ్ సౌకర్యం కల్పించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ డిమాండ్



**పాలకుర్తి,మే19(సాక్ష్యం):** పాలకులు మారిన ప్రజల అవస్థలు తిరడం లేదని సీపీఐ ఎల్ ఎల్ లిబరేషన్ పార్టీ మండల కార్యదర్శి కొనకటి కళింగ రాజు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో లక్షలు వెచ్చించి లక్షణంగా వదిలేసినా పోస్ట్ మార్టమ్ గది తన పార్టీ నాయకులతో కల్సి సందర్శించారు. ఈ సందర్భంగా కళింగరాజు మాట్లాడుతూ ఏండ్లు గడుస్తున్న లక్షల కోసి నిర్మించిన పోస్ట్ మార్టం గదిని ప్రజల సౌకర్యార్థం ఉపయోగంలోకి తీసుకురాకపోవడంలో కొట్టొచ్చినట్లుగా కనబడుతుందని కళింగ రాజు అన్నారు అనేక సౌకర్యాలు కల్పించినప్పటికీ చిన్న చిన్న కారణాల లేమితో ప్రజల సౌకర్యార్థం ఉపయోగించకపోవడంతో ఇక్కడి ప్రజలు అనేక కష్టాలకు కోర్చి జనగామ వరంగల్ లాంటి సుదూర ప్రాంతాలకు పోస్టుమార్టం కోసం వెళ్ళుతుండ డంతో ప్రజలు ఆర్థికంగా చలా నష్టపోతున్నారని అయన అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే పోస్టుమార్టం సౌకర్యం కల్పించి ఇక్కడి ప్రాంత ప్రజల అవస్థలు తీర్చాలని కళింగరాజు డిమాండ్ చేశారు. అంతకు ముందు ఆసుపత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ అపర్ణ ను కలిసి పోస్ట్ మార్టమ్ సౌకర్యం అందుబాటులోకి రాకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు జీడీ సోమయ్య. తూర్పటి సారయ్య. మహంకాళి శ్రీనివాస్. ఆర్ వై ఎల్ నాయకులు గ్యార రాజు. పెద్ది రాహుల్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# పుష్కర్ణి చెంతగల ఆంజనేయ స్వామికి ఆకు పూజ



**యాదగిరి కొండ సాక్షి న్యూస్..**యాదాద్రి పుణ్యక్షేత్రంలో మంగళవారం నిత్యారాధనలతో పాటు క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామిని కొలుస్తూ ఆకు పూజ పర్వాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాదాద్రి కొండ పై అనుబంధ శివాలయం చెంతన ఉన్న క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకు పూజను ఘనంగా నిర్వహించారు. హనుమం తుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమలపాకులతో అర్చించి లలితాపారాయణం చేశారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన వడపప్పు, బెల్లం, అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. ఈ పూజల్లో పాల్గొన్న స్థానికులకు, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## గుట్టలో ఘనంగా గౌలి కార్

# నర్సింగ్ రాజ్ జన్మదిన వేడుకలు







**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్..** ప్రముఖ వ్యాపారవేత్త సామాజిక సేవకులు విద్యావేత్త యాదగిరిగుట్టకు చెందిన గౌలికార్ నర్సింగరాజు జన్మదిన వేడుకలు యాదగిరిగుట్టలో ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలను వైఎస్ఆర్సిపి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు టిటిడి లోకల్ అడ్వైజరీ బోర్డు మాజీ మెంబర్ ఒడ్లోజు వెంకటేష్ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట పట్టణంలోని వైకుంఠ ద్వారం వద్ద ఘనంగా నిర్వహించారు . గౌలికర్ నర్సింగ్ రాజ్ 51 వ జన్మదిన సందర్భంగా యాదగిరిగుట్టలో 200 మందికి అన్నదానం చేశారు అంతకుముందు మహిళలకు పెద్ద ఎత్తున చీరలను పంపిణీ చేశారు. అదేవిధంగా యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన నిరుపేద ఎంబిబిఎస్ విద్యార్థినీ పడిగెల నిహారిక కు పదివేల రూపాయలు ఆర్థిక సాయం ను వెంకటేష్ చేశారు. ముందుగా కేక్ కట్ చేసి గౌలికర్ నర్సింగ్ రాజు జన్మదిన వేడుకలను ప్రారంభించారు బాణాసంచా కాల్చుతూ సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపాలిటీ కోఆప్షన్ మెంబర్ గౌలికారు అరుణ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడినా రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**(సాక్ష్యం) న్యూస్‌జయశంకర్ – భూపాలపల్లి, మే 19 :** ధాన్యం కొనుగోలులో అక్రమాలకు పాల్పడి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రైస్ మిల్లులను సీజ్ చేయడంతో పాటు పోలీస్ కేసులు నమోదు చేస్తామని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు హెచ్చరించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్‌లతో కలిసి గణపురంలోని జానకిరామ్ రైస్ మిల్, చిట్యాల మండలం కైలాపూర్‌లోని లక్ష్మీనరసింహ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం దిగుమతి జరుగుతున్నప్పటికీ రైతులకు ట్రక్ షీట్‌లు ఇవ్వకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంటా పూర్తయ్యిన వెంటనే రైతులకు ట్రక్ షీట్‌లు ఇవ్వాలని, ఆలస్యం ఎందుకు జరుగుతోందని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. ట్రక్ షీట్‌లు ఇవ్వకుండా ధాన్యాన్ని మిల్లులకు తరలించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ ముంచరాదని, ఇటువంటి చర్యల వల్ల జిల్లాకు చెడ్డ పేరు వస్తుందని స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడితే ఎవరినీ వదిలిపెట్టమని, మిల్లులను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు న్యాయం జరిగే విధంగా పనిచేస్తే పూర్తి సహకారం ఉంటుందని, కానీ అక్రమాలను సహించబోమని తెలిపారు. గత ఎనిమిదేళ్లుగా జరుగుతున్న దోపిడీ పద్ధతులు ఇకపై కొనసాగకుండా తక్షణమే సరిచేసుకోవాలని సూచించారు. అన్ని కొనుగోలు కేంద్రాలలో రైతులకు ట్రక్ షీట్‌లు ఇవ్వడం తప్పనిసరి చేయాలని, దీనిపై జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ పెంచాలి

## ఇంటాక్ కార్యక్రమాలకు పూర్తి

# సహకారం అందిస్తాం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

– సంస్కృతి, వారసత్వ పరిరక్షణలో ఇంటాక్ సేవలు అభినందనీయం



**మహబూబ్‌నగర్, మే 19 ( సాక్ష్యం బ్యూరో )** సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ పరిరక్షణతో పాటు గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవకాశాలు కల్పించడంలో ఇంటాక్ మహబూబ్‌నగర్ చాప్టర్ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. ఇంటాక్ మహబూబ్‌నగర్ చాప్టర్ సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని చాప్టర్ కార్యకలాపాల వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటాక్ చాప్టర్ ప్రధాన పరిరక్షకురాలిగా ఉండటం ఆనందంగా ఉందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ పరిరక్షణలో పంచాయతీల పాత్రపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. చాప్టర్ నిర్వహించే కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఇంటాక్ మహబూబ్‌నగర్ చాప్టర్ కన్వీనర్ డా. టి. నాగేందర్ స్వామి సంస్థ లక్ష్యాలు, కార్యక్రమాలు, వారసత్వ పరిరక్షణకు సంబంధించిన చర్యలను కలెక్టర్‌కు వివరించారు. కో–కన్వీనర్ చంద్రకుమార్, అదనపు కో–కన్వీనర్ వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ చాప్టర్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న వివిధ పోటీలు, విద్యార్థుల ప్రతిభాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా నూతనంగా సభ్యత్వం పొందిన సభ్యులతో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఇంటాక్ ఢిల్లీ నిర్వహించిన "సెలబ్రేటింగ్ ఇండియా" జాతీయ పోస్టర్ పోటీలలో ప్రాంతీయ, చాప్టర్ స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సాక్ష్యం
రాష్ట్రీయం
హైదరాబాద్ గురువారం 20 మే 2026


# ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన వైద్యం అందించాలి

- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి
- చౌటుప్పల్ మున్సిపాలిటీ తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, నిర్మాణంలో ఉన్న నూతన పిహెచ్‌సి భవనాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్







**చౌటుప్పల్ మే 19 (సాక్ష్యం)** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మంగళవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి లో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, గర్భిణీ స్త్రీలకు అందజేస్తున్న ఆరోగ్య పరీక్షలు, నిర్మాణంలో ఉన్న నూతన భవనం పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఓపీకి ఎంతమంది రోగులు వస్తున్నారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సరైన చికిత్స అందేలా చూడాలని సూచించారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఎన్‌సీడీ క్యాంపును కలెక్టర్ పరిశీలించారు. క్యాంపుకు వచ్చిన గర్భిణీ స్త్రీలకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలను పరిశీలించి, వారికి అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. గర్భిణీల రక్తపోటు, షుగర్ తదితర పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, అవసరమైన మందులు సమయానికి అందించాలని వైద్య అధికారులకు ఆదేశించారు. అనంతరం గర్భిణీ స్త్రీల ఆరోగ్య రికార్డులను పరిశీలించి, వారు ప్రతి నెలా రెగ్యులర్‌గా చెకప్‌కు వస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయా, అవసరమైన మందులు సరిపడా నిల్వలో ఉన్నాయా అనే విషయాలపై ఆరా తీశారు. గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, హైరిస్క్ కేసులను ముందుగానే గుర్తించి తగిన వైద్యం అందించాలని సూచించారు. పి హెచ్ సి పరిధిలో ప్రతి నెల ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయనీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు మరింత నమ్మకం కలిగే విధంగా సేవలు అందించాలని పేర్కొన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న నూతన పి హెచ్ సి భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఐకెపి ధాన్యం కొనుగోలు సెంటర్ ను కలెక్టర్ పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఎంత మేరకు ధాన్యం నిల్వ ఉందని, ఎంత మేర కొనుగోలు చేశారని ఆరా తీశారు. ధాన్యం కొలుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి మనోహర్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లారీ కారు డి వ్యక్తి మృతి







**వరంగల్, 19 మే(సాక్ష్యం)** వరంగల్ కాశిబుగ్గ పద్మా నగర్ కు చెందిన వెల్దండి వరుణ్ 32 (బీడీల కారుఖాన నిర్వాహకుడు) మంగళవారం తెల్లవారుజామున వరంగల్ నుండి నర్సంపేటకు వెళుతున్న క్రమంలో గిర్నిబావి దగ్గర ఇసుక లారీ స్పీడ్ గా వచ్చి కారును డీ కోవడం తో వరుణ్ తీవ్ర గాయాల పాలు కాగా వరంగల్ ఎంజిఎంకు తరలిస్తుంటే మార్గమధ్యలో మరణించినట్లు తెలిపారు. మృతునికి భార్య నిఖిత(28) కుమారుడు హైత్విక్ (8) కూతురు ఆహనా (6) ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే వరుణ్ మరణించడంతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

# 2వ వార్డులో తన సొంత ఖర్చులతో బోరు వేయించి తన దాతృత్వం చాటుకున్న ఈఎల్‌వి ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్



**చౌటుప్పల్ మే 19 (సాక్ష్యం )** చౌటుప్పల్ మున్సిపాలిటీ తాళ్ల సింగారం 2వ వార్డులో కౌన్సిలర్ పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య అభ్యర్థన మేరకు ఈ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ ఈ ఎల్ వి భాస్కర్ తన సొంత ఖర్చులతో బోరు వేయించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు ఈ ఎల్ వి భాస్కర్ ను పూలమాలవేసి శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాళ్ల సింగారం గ్రామం మాజీ సర్పంచులు నల్ల అంజయ్య యాదవ్, మరుపాక నరసింహ గౌడ్, పెద్దగోని జంగయ్య గౌడ్, నల్ల శివప్రసాద్ యాదవ్, నల్ల లింగస్వామి యాదవ్, కానుగు శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆవిర్భావ
# దినోత్సవాన ఉద్యమకారులను సన్మానించాలి



**మిర్యాలగూడ డివిజన్ మే 19 (సాక్ష్యం న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వ ఆధ్వర్యంలో సన్మానం చేయాలని ఉద్యమకారుల జేఏసీ నాయకులు మారం శ్రీనివాస్,మాలోతు దశరథ్ నాయక్,రాపోలు పరమేష్, బంటు వెంకటేశ్వర్లు,ఇక్బాల్ లు కోరారు. మంగళవారం స్థానిక అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటుచేసిన ఉద్యమకారుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఉద్యమం ఉధృతంగా కొనసాగిన ప్రాంతం మిర్యాలగూడ గుర్తింపు పొందిందన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యమకారులను విస్మరించారని ఆవిర్భావ దినోత్సవం రోజు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారిని గుర్తించి ప్రభుత్వం అధికారికంగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దాసరాజు జయరాజు,విజయకుమార్, మాశెట్టి కిషోర్,నక్క వెంకటేశ్వర్లు, పారేపల్లి గురునాథం,వరగాని కృష్ణమూర్తి, చీదల్ల సత్యనారాయణ, గుండెబోయిన చందుయాదవ్, డైమండ్ చిన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఐకేపీ వివోఏల సమ్మెబాట
# మండల కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం



**సాక్ష్యం మే 19 పాలేరు 20** ఏళ్లుగా గ్రామీణ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ఐకేపీ వివోఏలు ఇప్పుడు తమ హక్కుల కోసం రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందని గ్రామ దీపికల సమైక్య అధ్యక్షురాలు వేల్పుల సుశీల మండల ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ళ ఉమా అన్నారు. మే 19 న మంగళవారం నాడు తిరుమలాయపాలెం మండల కేంద్రంలో వివో ఏల జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల వ్యాప్తంగా ఉన్నటువంటి వివోఏలు సభ్యులు అందరూ ఏకమై 22వ తారీఖు నాడు జరగవలసిన సమ్మె పై సుదీర్ఘ చర్చలు జరిపి అట్టి అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు .ప్రభుత్వం మాపై చిన్న చూపు చూస్తుందని మా సమస్యల పరిష్కార కోసం ఎన్నిసార్లు విన్నవించుకున్న స్పందన లేదని అందుకే సమ్మె మార్గం ఎంచుకోవాల్సి వచ్చిందని ప్రస్తుతం ప్రారంభమైన సమ్మెతో గ్రామీణ స్థాయిలో ఐకేపీ కార్యాలయాలు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది అని అన్నారు. మా సమస్యలు పరిష్కరించేంతవరకు ఈ సమ్మె కొనసాగుతుందని వారు స్పష్టంగా చెబుతున్నారు. గ్రామాల్లో మహిళా సంఘాల బలోపేతం నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వరకు ఎన్నో బాధ్యతలు నిర్వర్తించినా తమ సేవలకు సరైన గుర్తింపు దక్కలేదని వివోఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా మహిళల శ్రమను గౌరవించాల్సిన ప్రభుత్వాలు వారిపై పని ఒత్తిడి పెంచుతూ కనీస భద్రత కల్పించకపోవడంపై విమర్శలు గుప్పిస్తున్నారు. గ్రామీణ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న వివో ల పై నిర్లక్ష్యం చేయడం సరైనదా అనే ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. గ్రామ అభివృద్ధికి మేమే వెన్నెముక కానీ మా కష్టానికి విలువ ఎక్కడ అంటూ మహిళా కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఏళ్ల తరబడి తక్కువ వేతనాలతో ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తూ కుటుంబాలను పోషించడం కష్టమైందని వారు చెబుతున్నారు. వెట్టిచాకిరిలా మారిన ఉద్యోగంరోజంతా గ్రామాల్లో తిరుగుతూ ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ కనీస హక్కులు కూడా లభించకపోవడం బాధాకరమని వివోఏలు పేర్కొంటున్నారు. పని మాత్రం పెరుగుతూనే ఉందిగానీ వేతనాలు మరియు సౌకర్యాలు మాత్రం అదే స్థాయిలో ఉండిపోయాయని విమర్శిస్తున్నారు. సమస్యలను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతోనే సమ్మెబాట పట్టామని మహిళలు తెలిపారు. మండల కేంద్రాల్లో నిరసనలు, ర్యాలీలు నిర్వహిస్తూ తమ డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం ఆగదు అని వివోఏల జేఏసీ స్పష్టం చేసింది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ గౌరవ వేతనం గుర్తింపు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమం లో ఐకెపి వివో ఏ ల జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల, గౌరవాధ్యక్షురాలు పోలూరి విజయలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ళ ఉమా, పోలిశెట్టి అరుణ, మేకల కృష్ణవేణి, ఉపేంద్ర, గుంతెటి విజయ్ కుమారి, గుగ్గిళ్ళ విజయ, కామినేని కరుణ, బొడ్డు కుసుమ ,గడ్డి కొప్పుల ఉష, నాగమణి, తాళ్లపల్లి నరేష్, మహంకాళి ప్రసాద్ పద్మ, రాంబాయి, మెట్టు రాణి తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

- 59 మంది లబ్ధిదారులకు అందచేసిన ఎమ్మెల్యే నాగరాజు





**వర్ధన్నపేట డివిజన్ మే 19 (సాక్ష్యం న్యూస్)** వరంగల్ జిల్లా పర్వతగిరి మండల పరిధిలోని కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 59 మంది లబ్ధిదారులకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సోమవారం చెక్కులను పంపిణీ చేశారు. 59 మంది లబ్ధిదారులకుఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సీఎం శ రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలుగుతోందని, ఆడబిడ్డల వివాహాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సెంట్రింగ్ కార్మికుల సమస్యల
# పరిష్కారానికి పనిబంద్ కొనసాగింపు



**సికింద్రాబాద్, మే 19 (సాక్ష్యం):** భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి చేపట్టిన పనిబంద్ కొనసాగుతోంది. కార్మికుల సంక్షేమం, భద్రత, సామాజిక రక్షణ చర్యలు అమలు చేయాలని సంఘం ప్రభుత్వాన్ని కోరింది. అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. పరశురామ్ రెడ్డి, చైర్మన్ యం.డి. చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శి సి. విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎన్. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికులకు కార్మికశాఖ ద్వారా శాశ్వత గుర్తింపు కార్డులు జారీ చేయాలని, 55 సంవత్సరాలు పూర్తిచేసుకున్న కార్మికులకు నెలకు రూ. 3,000 పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ వైద్య సేవలు, ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. సెంట్రింగ్ మెటీరియల్ దొంగతనాలపై వెంటనే చర్యలు తీసుకుని కేసుల దర్యాప్తు జరపాలని, దొంగిలించిన మెటీరియల్‌ను స్క్రాప్ వ్యాపారులు కొనుగోలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జీహెచ్ఎంసీ అనుమతి లేని భవనాలను కూల్చివేసే ముందు సెంట్రింగ్ మెటీరియల్ తొలగించేందుకు అవకాశం ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు ప్రభుత్వ నష్టపరిహారాన్ని రూ. 20 లక్షలకు పెంచాలని కోరారు. ప్రమాదాలకు గురైన కార్మికులకు సంక్షేమ బోర్డు గుర్తింపు కార్డు లేకపోయినా పోలీస్ ఎఫ్ఐఆర్ ఆధారంగా నష్టపరిహారం అందించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఫ్యూచర్ సిటీలో సెంట్రింగ్ సంఘానికి రెండు ఎకరాల స్థలం కేటాయించాలని, నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి సెంట్రింగ్ మెటీరియల్ కొనుగోలుకు బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు అందించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సెంట్రింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు.



# సంజు శాంసన్ సరికొత్త రికార్డు

ఇండియన్ ప్రీమియర్ లీగ్  లో మహేంద్ర సింగ్ ధోని సుదీర్ఘకాలంగా ఏలుతున్న ఒక అరుదైన రికార్డుల లిస్టులో సంజు శాంసన్ తన పేరును లిఖించుకున్నాడు. సోమవారం చెపాక్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్  జట్టుతో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ ఈ అద్భుతమైన ఘనత సాధించాడు. ఒకే ఐపీఎల్ సీజన్ లో సీఎస్‌కే తరపున ఒక వికెట్ కీపర్ గా



అత్యధిక పరుగులు చేసిన ఎంఎస్ ధోని రికార్డును ఆయన బద్దలు కొట్టాడు. ఇంతకుముందు ధోని 2013 ఐపీఎల్ సీజన్ లో 16 ఇన్నింగ్స్ ఆడి 461 పరుగులు సాధించాడు. ఈ మార్కును దాటడానికి శాంసన్‌కు మ్యాచ్ ప్రారంభంలో కేవలం 12 పరుగులు మాత్రమే అవసరం అవ్వగా, ఆయన కేవలం ఆరు బంతుల్లోనే 15 పరుగులు చేసి ఆ మైలురాయిని దాటేశాడు. హైదరాబాద్ బౌలర్ నితీష్ కుమార్ రెడ్డి వేసిన మొదటి ఓవర్ లోనే శాంసన్ ఈ స్కోరు అందుకోవడం విశేషం. రికార్డు దాటిన తర్వాత కూడా సంజు శాంసన్ తన అగ్రెసివ్ బ్యాటింగ్ శైలిని అస్సలు ఆపలేదు. రెండో ఓవర్ లో బౌలింగ్‌కు వచ్చిన ప్రఫుల్ హింగే ఓవర్ లో వరుసగా మూడు బౌండరీలు బాది స్టేడియాన్ని హోరెత్తించాడు. కేవలం 11 బంతుల్లోనే 27 పరుగులు చేసి మంచి టచ్ లో కనిపించిన శాంసన్‌ను అడ్డుకోవడానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ స్వయంగా బౌలింగ్ రంగానికి వచ్చాడు. కమిన్స్ వేసిన ఒక పవర్‌ఫుల్ యార్కర్‌ను శాంసన్ సమర్థవంతంగా డిఫెండ్ చేశాడు. ఆ తర్వాతి బంతిని కమిన్స్ ఆఫ్ స్టంప్‌కు వెలుపల వేయగా, శాంసన్ డ్రైవ్ చేయడానికి ప్రయత్నించాడు. ఆ షాట్ మిస్ అవ్వడంతో బంతి బ్యాట్ ఎడ్జ్ కు తగిలి వికెట్ కీపర్ చేతుల్లోకి వెళ్ళింది. దాంతో శాంసన్ ఇన్నింగ్స్ ముగిసింది. ఓవరాల్ గా చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో వికెట్ కీపర్ బ్యాటర్ గా ధోని రికార్డులు అన్-మ్యాచ్డ్ గా ఉన్నప్పటికీ, ఈ లిస్టులో ప్రముఖంగా నిలిచిన రెండో ప్లేయర్ గా సంజు శాంసన్ గుర్తింపు తెచ్చుకున్నాడు. ఐపీఎల్ లో ఒకే సీజన్ లో సీఎస్‌కే తరపున 100 కంటే ఎక్కువ పరుగులు చేసిన వికెట్ కీపర్లు కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. వారిలో మొదటి వ్యక్తి ఎంఎస్ ధోని కాగా, రెండో ఆటగాడు 2008 సీజన్ లో రాణించిన పార్థివ్ పటేల్. ఇప్పుడు ఈ 2026 సీజన్ లో సంజు శాంసన్ ఆ లిస్టులోకి చేరాడు. ప్రస్తుత ఐపీఎల్ 2026 టోర్నమెంట్ లో శాంసన్ అద్భుతమైన ఫామ్ లో ఉన్నాడు. ఆయన ఇప్పటివరకు 13 ఇన్నింగ్స్ ఆడి 47.7 సగటుతో మొత్తంగా 477 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్ రేసులో దూసుకుపోతున్నాడు. అంతకుముందు ఎమ్ ఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఈ సీజన్ లో అంతకుముందు రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో హైదరాబాద్ జట్టు చెన్నైని 10 పరుగుల తేడాతో ఓడించింది. టాస్ సమయంలో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఒక ముఖ్యమైన విషయాన్ని షేర్ చేశాడు. ఫిట్‌నెస్ సమస్యల కారణంగా లెజెండరీ ప్లేయర్ ఎంఎస్ ధోని ఈ మ్యాచ్ ఆడటం లేదని స్పష్టం చేశాడు.  ధోని జట్టుతోనే ఉన్నప్పటికీ ఆడే పరిస్థితిలో లేకపోవడం వల్ల జట్టులో ఒక మార్పు చేసినట్లు రుతురాజ్ పేర్కొన్నాడు.

# ఒకే బెర్త్.. ఐదు జట్ల పోటీ..

ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ రేసులో మూడు బెర్త్‌లు కన్ఫార్మ్ అయ్యాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇప్పటికే ప్లేస్ ఫిక్స్ చేసుకోగా.. చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించిన తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్‌తోపాటు గుజరాత్ టైటాన్స్ కూడా ప్లే ఆఫ్స్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. మూడు జట్లు తమ స్థానాలను ఖరారు చేసుకోగా.. మిగిలిన ఒక స్థానం కోసం ఐదు జట్ల మధ్య పోటీ నెలకొంది. ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ అధికారికంగా ప్లే ఆఫ్స్ నుంచి తప్పుకోగా.. పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు ఒక స్థానం కోసం పోటీ పడుతున్నాయి.  ఈ సీజన్‌లో ఫస్టాఫ్‌లో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్.. సెకండాఫ్‌లో పూర్తిగా తేలిపోయింది. వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో ఓటమితో ప్లే ఆఫ్స్ ఆశలు సంక్లిష్టం చేసుకుంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆఖరి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో పంజాబ్ గెలిస్తే.. 15 పాయింట్లకు చేరుకుంటుంది.  అదే సమయంలో రాజస్థాన్ రాయల్స్ తమ రెండు మ్యాచ్‌లలో కచ్చితంగా ఒక మ్యాచ్‌లో ఓడిపోవాలి. కేకేఆర్ కూడా ఒక మ్యాచ్‌లో ఓడిపోవాలి. ఒకవేళ కేకేఆర్ రెండు మ్యాచ్‌లు గెలిచినా.. నెట్ రన్ రేట్‌లో పంజాబ్ కంటే వెనుకబడాలి. లక్నో చేతిలో పంజాబ్ ఓడిపోతే.. 13 పాయింట్ల వద్దే ఆగిపోయి.. కేకేఆర్, రాజస్థాన్, ఢిల్లీ, చెన్నై జట్ల ఓటమి కోసం ప్రార్థించాల్సి ఉంటుంది.రాజస్థాన్ రాయల్స్‌కు ఇంకా రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇవాళ లక్నో సూపర్ జెయింట్స్‌తో.. మరొకటి ఆదివారం ముంబై ఇండియన్స్‌తో ఆడనుంది. రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే.. 16 పాయింట్లతో ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా నేరుగా ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటుంది. ఒకవేళ రాజస్థాన్ ఒక్క మ్యాచ్‌లో గెలిచి.. ఒకటి ఓడిపోతే.. అప్పుడు 14 పాయింట్లతో ఉంటారు. పంజాబ్ కింగ్స్, కేకేఆర్ జట్లతోపాటు చెన్నై, ఢిల్లీ జట్ల ఓటమి కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది. రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోతే.. టోర్నీ నుంచి ఔట్ అవుతుంది.సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓటమి కావడంతో ప్లేఆఫ్స్‌కు చేరేందుకు చెన్నై సూపర్ కింగ్స్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. చివరి మ్యాచ్‌లో గెలిస్తే.. 14 పాయింట్లకు చేరుకుంటుంది. అదేసమయంలో పంజాబ్ తమ చివరి మ్యాచ్‌లో ఓడిపోవాలి. రాజస్థాన్ తప్పనిసరిగా రెండు మ్యాచ్‌లలోనూ ఓడిపోవాలి. కేకేఆర్, ఢిల్లీ కూడా గెలవకూడదు. చెన్నై అవకాశాలు రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్ జట్ల ఫలితాలపై ఎక్కువగా ఆధారపడి ఉంది.12 మ్యాచ్‌లు ఆడిన కోల్‌కతా నైట్‌రైడర్స్ 11 పాయింట్లతో 8వ స్థానంలో ఉంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే.. 15 పాయింట్లకు చేరుకుంటుంది.  అదే సమయంలో పంజాబ్ తమ చివరి మ్యాచ్‌లో ఓడిపోవాలి. రాజస్థాన్ రాయల్స్ కూడా కనీసం ఒక మ్యాచ్‌లో ఓడిపోవాలి. అప్పుడు కేకేఆర్ ప్లే ఆఫ్స్‌లోకి చేరుకుంటుంది. వరుసగా రెండు విజయాలతో టోర్నీని ఆరంభించిన ఢిల్లీ క్యాపిటల్స్.. ఆ తరువాత పడుతూ లేస్తూ వచ్చింది. గత రెండు మ్యాచ్‌ల్లో విజయంతో ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. ప్రస్తుతం 12 పాయింట్లతో ఉన్న ఢిల్లీ.. మరో మ్యాచ్ కేకేఆర్‌తో ఆడాల్సి ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే 14 పాయింట్లకు చేరుకుంటుంది. అదే సమయంలో రాజస్థాన్ తన రెండు మ్యాచ్‌లలోనూ ఓడిపోవడంతోపాటు పంజాబ్, చెన్నై కూడా జట్లు కూడా గెలవకూడదు. ఇవన్నీ జరిగితేనే ఢిల్లీ ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటుంది.



# ఆఫ్ఘనిస్తాన్ వన్డే సిరీస్‌కు భారత జట్టు ప్రకటన

## జట్టులోకి హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్

ఐపీఎల్ 2026 ఫీవర్ ముగిసేలోపే టీమ్‌ఇండియా మళ్లీ ఇంటర్నేషనల్ క్రికెట్ మోడ్‌లోకి ఎంటర్ కానుంది. మే 31న ఐపీఎల్ ఫైనల్‌తో మెగా టోర్నీ ముగియనుండగా.. వెంటనే జూన్‌లో అఫ్గానిస్థాన్‌తో కీలక సిరీస్‌కు భారత్ సిద్ధమవుతోంది. స్వదేశంలో జరగనున్న ఈ సిరీస్‌లో ఒక టెస్టు, మూడు వన్డేలు ఉండనున్నాయి. ఈ టూర్ కోసం భారత సీనియర్ సెలక్షన్ కమిటీ తాజాగా జట్లను ప్రకటించింది. ఈసారి జట్టులో యువ ఆటగాళ్లకు పెద్దపీట వేయడం విశేషం. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంగా విశ్రాంతి ఇచ్చారు. మరోవైపు వన్డే జట్టులో రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యలకు చోటు దక్కినా.. వారి ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని



సెలెక్టర్లు స్పష్టం చేశారు. చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ మాట్లాడుతూ.. మహ్మద్ షమి విషయంపై సెలక్షన్ కమిటీ చర్చించలేదని తెలిపారు. ఈ సిరీస్‌లో యువ క్రికెటర్లకు భారీ అవకాశం దక్కింది. హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్ తొలిసారిగా భారత జట్టులో స్థానం సంపాదించారు. ముఖ్యంగా ప్రిన్స్ యాదవ్ వన్డే జట్టులోనే చోటు దక్కించుకోవడం ఆసక్తికరంగా మారింది. టెస్టు జట్టుకు యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. వైస్ కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ వ్యవహరించనున్నాడు. యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్, రిషభ్ పంత్, దేవ్‌దత్ పడిక్కల్ వంటి యువ ఆటగాళ్లతో జట్టు బలంగా కనిపిస్తోంది. బౌలింగ్ విభాగంలో మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్ కీలక బాధ్యతలు తీసుకోనున్నారు. వన్డే జట్టులో మాత్రం అనుభవం-యువత కలయిక కనిపిస్తోంది. కెప్టెన్‌గా మళ్లీ శుభ్‌మన్ గిల్‌కే బాధ్యతలు అప్పగించగా.. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్ వంటి సీనియర్ బ్యాటర్లు జట్టుకు బలం కానున్నారు. ఇషాన్ కిషన్ తిరిగి వన్డే సెటప్‌లో చోటు సంపాదించగా.. అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి పేసర్లు అఫ్గాన్ బ్యాటర్లకు సవాల్ విసరనున్నారు.

### అఫ్గాన్‌తో ఏకైక టెస్టుకు భారత జట్టు..

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), సాయి సుదర్శన్, రిషభ్ పంత్, దేవ్‌దత్ పడిక్కల్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, మానవ్ సుతార్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, ధ్రువ్ జురెల్, హర్ష్ దూబె.

# గుజరాత్ టైటాన్స్ నుంచి అత్యధికంగా నలుగురు..

బీసీసీఐ మంగళవారం అఫ్గానిస్తాన్‌తో జరగబోయే వన్డే సిరీస్ కోసం 15 మందితో కూడిన టీమిండియాను ప్రకటించింది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని ఈ జట్టు ఎంపికలో ప్రస్తుత ఐపీఎల్ 2026 ప్రదర్శనలు స్పష్టమైన ప్రభావాన్ని చూపించాయి. అయితే ఈ జట్టులో ఐపీఎల్ ఫ్రాంచైజీల వారీగా ఆటగాళ్ల ప్రాతినిధ్యం ఎలా ఉందో చూస్తే పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వన్డే సిరీస్ జట్టులో గుజరాత్ టైటాన్స్ ఫ్రాంచైజీ నుంచి అత్యధికంగా నలుగురు ఆటగాళ్లు చోటు దక్కించుకున్నారు. భారత జట్టును ముందుండి నడిపించబోయే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నాడు. గాయం కారణంగా గత వన్డే సిరీస్‌కు దూరమైన ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ తిరిగి జట్టులోకి వచ్చాడు. ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ కూడా తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అయితే అందరినీ ఆశ్చర్యపరుస్తూ, గుజరాత్ తరపున ఇంకా ఐపీఎల్ అరంగేట్రం కూడా చేయని యువ బౌలర్ గుర్నూర్ బ్రార్‌కు తొలిసారి జాతీయ జట్టు నుంచి పిలుపు రావడం గమనార్హం. ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ నుంచి ముగ్గురు ఆటగాళ్లను సెలెక్టర్లు ఎంపిక చేశారు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, 2026 టీ20 ప్రపంచకప్, ఆపై ఐపీఎల్‌లో పరుగుల వరద పారించిన ఇషాన్ కిషన్ భారీ పునరాగమనం చేశాడు. తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి కూడా వన్డే జట్టులో తన స్థానాన్ని కాపాడుకున్నాడు. ఇక హైదరాబాద్ స్పిన్నర్ హర్ష్ దూబే ఈ ఐపీఎల్‌లో 8 వికెట్లతో రాణించడంతో, అతడికి తొలిసారి భారత జట్టులో అవకాశం కల్పించారు.ముంబై ఇండియన్స్ నుంచి సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా ఎంపికైనప్పటికీ, వీరిద్దరి లభ్యత వారి ఫిట్‌నెస్‌పైనే ఆధారపడి ఉంటుంది. రోహిత్ పిక్క కండరాల గాయంతో, పాండ్యా నడుము నొప్పితో బాధపడుతున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఎంపికయ్యారు. పంజాబ్ కింగ్స్ నుంచి ఎడమచేతి వాటం బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌తో పాటు, ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను ఈ సిరీస్‌కు వైస్ కెప్టెన్‌గా నియమించారు.రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నుంచి రన్ మెషీన్ విరాట్ కోహ్లీ ఒక్కడే జట్టులో ఉన్నాడు. లక్నో సూపర్ జయంట్స్ తరపున ఐపీఎల్‌లో విరాట్ కోహ్లీ వికెట్ తీసి సంచలనం సృష్టించిన యువ ఫాస్ట్ బౌలర్ ప్రిన్స్ యాదవ్‌కు తొలిసారి భారత జట్టులో చోటు దక్కింది. కాగా, ఐదుసార్లు ఛాంపియన్ అయిన చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్ జట్ల నుంచి ఒక్క ఆటగాడికి కూడా ఈ 15 మంది జట్టులో చోటు దక్కకపోవడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.





# పంత్ కెరీర్ ముగిసినట్లేనా..?

ఐపీఎల్ 2026 ముగియక ముందే భారత క్రికెట్‌లో మరో భారీ ట్విస్ట్ చోటుచేసుకుంది. ఆఫ్ఘనిస్తాన్‌తో జూన్ 6 నుంచి ప్రారంభమయ్యే ఏకైక టెస్టు కోసం బీసీసీఐ ప్రకటించిన జట్టులో అత్యంత హాట్ టాపిక్‌గా మారింది రిషబ్ పంత్ డిమోషన్. టీమ్‌ఇండియా భవిష్యత్ నాయకుల్లో ఒకడిగా భావించిన పంత్‌ను టెస్టు వైస్ కెప్టెన్సీ నుంచి తప్పిస్తూ.. అనుభవజ్ఞుడు కేఎల్ రాహుల్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. ఈ నిర్ణయం ఇప్పుడు భారత క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. రోహిత్ శర్మ టెస్టులకు వీడ్కోలు పలికిన తర్వాత భారత జట్టులో నాయకత్వ మార్పులు వేగంగా జరిగాయి. యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌ను టెస్టు కెప్టెన్‌గా ఎంపిక చేసిన సెలెక్టర్లు.. అప్పట్లో రిషబ్ పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. కానీ ఇప్పుడు కేవలం కొద్ది కాలంలోనే పంత్ నుంచి ఆ బాధ్యతలను తీసేసి, కేఎల్ రాహుల్‌కు అప్పగించడం గమనార్హం. జూన్ 6 నుంచి ముల్లన్‌పూర్ వేదికగా ప్రారంభమయ్యే ఈ టెస్టులో శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా జట్టును నడిపించనున్నాడు. అతనికి డిప్యూటీగా కేఎల్ రాహుల్ వ్యవహరించనున్నాడు. ఈ మార్పుతో టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ భవిష్యత్ నాయకత్వంపై స్పష్టమైన సంకేతాలు ఇచ్చిందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. రిషబ్ పంత్‌ను వైస్ కెప్టెన్సీ నుంచి తొలగించడం ఒక్కసారిగా తీసుకున్న నిర్ణయం కాదని తెలుస్తోంది. దీనికి పలు కారణాలు ఉన్నాయని బీసీసీఐ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా కెప్టెన్సీ ఒత్తిడి అతని సహజమైన దూకుడు బ్యాటింగ్‌ను ప్రభావితం చేస్తోందనే అభిప్రాయం సెలెక్టర్లలో బలపడిందని సమాచారం. ఐపీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా పంత్ ప్రదర్శన తీవ్ర విమర్శలకు గురైంది. బ్యాటింగ్‌లోనూ అతను ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. కీలక మ్యాచ్‌ల్లో తీసుకున్న నిర్ణయాలు కూడా ప్రశ్నార్థకంగా మారాయి. దీంతో నాయకత్వ బాధ్యతల కంటే అతను పూర్తిగా బ్యాటింగ్‌పైనే దృష్టి పెట్టాలని బోర్డు భావించినట్లు తెలుస్తోంది. అంతేకాదు.. గతంలో దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ మైదానం వెలుపల ఉన్న సమయంలో పంత్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు. అయితే ఆ సమయంలో అతని ఫీల్డ్ సెట్టింగ్స్, బౌలింగ్ మార్పులు టీమ్ మేనేజ్‌మెంట్‌ను పెద్దగా ఆకట్టుకోలేదని సమాచారం. రిషబ్ పంత్ అంటే భారత అభిమానులకు వెంటనే గుర్తొచ్చేది గబ్బా హీరోయిక్స్. ఒంటరిగా మ్యాచ్‌ను తిప్పేసే దూకుడు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడినప్పుడు పంత్ అత్యంత ప్రమాదకరమైన మ్యాచ్ విన్నర్‌గా మారతాడని బీసీసీఐ నమ్ముతోంది. అందుకే ఇప్పుడు అతనిపై ఉన్న నాయకత్వ భారం తగ్గించి, పూర్తిగా వికెట్ కీపర్-బ్యాటర్ పాత్రకే పరిమితం చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ దిగ్గజాలు క్రమంగా టెస్టు జట్టుకు దూరమవుతున్న నేపథ్యంలో ఇప్పుడు అనుభవజ్ఞుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో కేఎల్ రాహుల్ జట్టులో అత్యంత అనుభవం ఉన్న ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. రాహుల్ ఇప్పటికే భారత జట్టుకు మూడు టెస్టుల్లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. 2022లో జోహన్నెస్‌బర్గ్‌లో దక్షిణాఫ్రికాపై భారత్‌ను నడిపించడంతో పాటు.. బంగ్లాదేశ్ పర్యటనలో కూడా నాయకత్వ బాధ్యతలు చేపట్టాడు. ప్రశాంత స్వభావం, క్లిష్ట పరిస్థితుల్లో స్థిరంగా ఆలోచించే తీరు అతనికి ప్లస్ పాయింట్‌గా మారాయి. అందుకే యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు సరైన సపోర్ట్‌గా రాహుల్‌ను సెలెక్టర్లు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. రిషబ్ పంత్‌కు ఎదురైన ఎదురుదెబ్బ కేవలం టెస్టులకే పరిమితం కాలేదు. అతను ఇప్పటికే టీ20 సెటప్‌కు దూరమయ్యాడు. ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌కు కూడా అతనికి చోటు దక్కలేదు. దీంతో మూడు ఫార్మాట్లలోనూ తన స్థానాన్ని నిలబెట్టుకోవడానికి పంత్ ఇప్పుడు భారీగా పరుగులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశీయ క్రికెట్, రాబోయే సిరీస్‌లలో తన బ్యాట్‌తోనే సమాధానం చెప్పాల్సిన ఒత్తిడి ఇప్పుడు పంత్‌పై స్పష్టంగా కనిపిస్తోంది.

# గ్రాండ్‌గా జరిగిన "ఆర్ కే దీక్ష" సాంగ్స్, టీజర్ లాంచ్ ఈవెంట్ – జూన్ 12న మూవీ రిలీజ్

ఆర్ కె ఫిలిమ్స్, సిగ్ధ క్రియేషన్స్ బ్యానర్‌లపై డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వం వహించి నిర్మించిన చిత్రం "ఆర్ కే దీక్ష". డి.ఎస్. రెడ్డి సమర్పణలో రూపొందిన ఈ చిత్రంలో ఢీ, జోడి ఫేమ్ అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్లుగా నటించగా, కిరణ్ హీరోగా కనిపించనున్నారు. తులసి, అనూష, కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా జూన్ 12న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. దర్శకనిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో ఈ చిత్ర సాంగ్స్ , టీజర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ఎ. గురురాజ్ మాట్లాడుతూ – "డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు. 'ఆర్కే దీక్ష' చిత్రాన్ని ఎంతో క్వాలిటీగా రూపొందించారని సాంగగ్స్, టీజర్ చూస్తేనే తెలుస్తోంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అన్నారు. పొలిటికల్ లీడర్ గ్యాదరి బాలమల్లు మాట్లాడుతూ – "సిద్ధిపేట ప్రాంతం నుంచి వచ్చిన డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ గారు రాజకీయంగా, సినీ రంగంలో ఎంతోకాలంగా కొనసాగుతున్నారు. అనేక చిత్రాలు నిర్మించి, దర్శకత్వం వహించారు. నటుడిగానూ రాణించారు. 'ఆర్కే దీక్ష' చిత్రం కూడా ఆయనకు సక్సెస్ అందించాలి" అన్నారు.

కెనడా వాసి తరుణ్ సాహి మాట్లాడుతూ – "ఈ చిత్రంలో ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మంచి మెసేజ్ కూడా ఉంది. సినిమా టీమ్ అందరికీ నా బెస్ట్ విషెస్" అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ రాజ్ కిరణ్ మాట్లాడుతూ – "ఈ చిత్రానికి సంగీతం అందించే అవకాశం ఇచ్చిన డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ గారికి థ్యాంక్స్. హీరో కిరణ్, హీరోయిన్ అక్స ఖాన్ తమ పాత్రల్లో జీవించారు. ఈ చిత్రంలో మంచి సంగీతం అందించాం" అన్నారు. బీసీ సంఘం నేత అంజలి మాట్లాడుతూ – "డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ గతంలో మంచి మూవీస్ చేశారు. 'దీక్ష' చిత్రం కూడా అందరికీ ఇన్స్‌పైర్ చేసేలా ఉండబోతోంది. సాంగ్స్, టీజర్ ఆకట్టుకునేలా ఉన్నాయి" అన్నారు. విశ్రాంత న్యాయమూర్తి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ – "సినిమాలు వినోదంతో పాటు ప్రేక్షకులను



ఆలోచింపజేసేలా ఉండాలి. సమాజానికి మంచి చేయాలి. అలాంటి మంచి ప్రయత్నాన్ని 'ఆర్కే దీక్ష' చిత్రంతో చేస్తున్నారు" అన్నారు. హీరో కిరణ్ మాట్లాడుతూ – "డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ గారు ఎంతోమంది కొత్తవారికి అవకాశాలు ఇస్తున్నారు.

దీక్ష, పట్టుదల ఉంటే జీవితంలో ఏదైనా సాధించగలం అని చెప్పే చిత్రమిది. రాజ్ కిరణ్ సంగీతం మా సినిమాకు ప్రత్యేక ఆకర్షణ అవుతుంది" అన్నారు. హీరోయిన్ అక్స ఖాన్ మాట్లాడుతూ – "ఈ రోజు విడుదల చేసిన సాంగ్, టీజర్ అందరికీ నచ్చాయని నమ్ముతున్నాం. మంచి కంటెంట్‌తో వస్తున్న చిత్రమిది. ఈ సినిమాలో ఒక స్పెషల్ సాంగ్ కూడా చేశాను" అన్నారు. చిత్ర సమర్పకులు డీఎస్ రెడ్డి మాట్లాడుతూ – "ఈ సినిమా ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మంచి సందేశాన్ని అందిస్తుంది. మన వీర జవాన్ల సాహసాలపై రూపొందించిన స్పెషల్ సాంగ్ ప్రతి ఒక్కరినీ కదిలిస్తుంది" అన్నారు. ఫైట్ మాస్టర్ రవి మాట్లాడుతూ – "ఈ చిత్రంలో ఫైట్స్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ఆర్కే గౌడ్ గారు ఎంతోమంది ఫైటర్స్‌కు ఉచితంగా మెంబర్‌షిప్‌లు ఇచ్చి సపోర్ట్ చేస్తున్నారు" అన్నారు. నటి తులసి మాట్లాడుతూ – "ఈ చిత్రంలో ఫ్రెండ్ పాత్రలో నటించాను. మన సైనికుల ధైర్యసాహసాలను చెప్పేలా రూపొందించిన పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది" అన్నారు. దర్శక నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ – "ఈ రోజు మా మూవీ సాంగ్స్, టీజర్ లాంచ్ ఈవెంట్‌కు వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. ప్రతి మనిషిలో దీక్ష, పట్టుదల ఉంటాయి. వాటితో పనిచేస్తే ఏదైనా సాధించగలం అని చెప్పే చిత్రమిది. వీర జవాన్ మురళీనాయక్ గొప్పతనాన్ని తెలియజేసేలా ఒక స్పెషల్ సాంగ్ రూపొందించాం. జూన్ 12న విడుదల కానున్న 'ఆర్కే దీక్ష' చిత్రాన్ని ప్రేక్షకులు విజయవంతం చేయాలి" అన్నారు. నటుడు సుమన్ మాట్లాడుతూ – "డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ గారు సినిమాపై ప్యాషన్ ఉన్న వ్యక్తి. వీర జవాన్ సాహసాన్ని చెప్పే పాటను థ్రిల్లింగ్‌గా రూపొందించారు. ఈ చిత్రంలో మంచి కంటెంట్ ఉంది. కిరణ్, అక్సా ఇద్దరూ చాలా బాగా నటించారు" అన్నారు.

# 'పురుష:' మూవీ ప్రతీ ఒక్కరికీ నచ్చుతుంది

బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు 'పురుష:' సినిమాను నిర్మించారు. ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతోన్నారు. ఈ మూవీకి



వీరు వులవల దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్, రాయంచ కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాను మే 22న రిలీజ్ చేయబోతోన్నారు. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా సోమవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో.. బత్తుల పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ .. ''పురుష:' సినిమాని ఈ స్థాయికి తీసుకు వచ్చిన నిర్మాత కోటేశ్వరరావు గారికి, సరస్వతి గారికి థాంక్స్. మా దర్శకుడు వీరు గారు నన్ను ఎంతో బాగా చూసుకున్నారు. నాకు ఈ జర్నీలో ఆయన ఎంతో సపోర్ట్ చేశారు. సతీష్ గారు మా అందరినీ ఎంతో అద్భుతంగా చూపించారు. నా కెమెరా ఫియర్‌ను ఆయనే తొలగించారు. శ్రవణ్ గారు మాకు మంచి పాటల్ని ఇచ్చారు. రవి గారు మాకు మంచి సెట్స్ వేసిచ్చారు. సప్తగిరి అన్న, కసిరెడ్డి అన్న నన్ను సొంత తమ్ముడిలా చూసుకున్నారు. వారే నా సిగ్గు, భయాన్ని, బిడియాన్ని పోగొట్టారు. వెన్నెల కిషోర్ గారితో, రాజీవ్ కనకాల గారితో, వీటీవీ గణేష్ గారితో వర్క్ చేయడం వల్ల ఎంతో నేర్చుకున్నాను. రాయంచ, హాసిని, విషిక నాకెంతో సపోర్ట్ చేశారు. మా కోసం వచ్చిన తేజు గారికి థాంక్స్. ఈ మూవీకి పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన మా నాన్నకి థాంక్స్. మా నాన్న కష్టం చూస్తూ నేను పెరిగాను. నా కోసం మా అక్క ఎక్కువగా కష్టపడుతుంటారు. మే 22న థియేటర్లో కలుద్దాం. 'పురుష:' మూవీ ప్రతీ ఒక్కరికీ నచ్చుతుంది. అసలే ఈ సమ్మర్‌లో అందరూ ఇంట్లోనే ఉంటారు. ఫ్యామిలీ అంతా కలిసి థియేటర్‌కు వెళ్లి హాయిగా చూసేలా మా సినిమా ఉంటుంది. అందరూ ఫుల్‌గా ఎంటర్టైన్ అవుతారు' అని అన్నారు.

# 'ఐక్య' నా బిడ్డ లాంటిది..

## మా ఈ ట్రస్ట్ వాయిస్‌లెస్‌కి వాయిస్‌గా ఉంటుంది
## పుట్టిన రోజు సందర్భంగా మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించిన రా కింగ్ మనోజ్ మంచు

**టాలీవుడ్‌లో ప్రముఖ స్టార్ హీరో రా కింగ్ మనోజ్ మంచు ఎన్నో మంచి చిత్రాలతో ఆడియెన్స్‌ని అలరించారు. ఎప్పుడూ ప్రయోగాత్మక చిత్రాల్ని చేస్తూ, డిఫరెంట్ కంటెంట్‌తో సినిమాల్ని తీస్తూ కోట్లాది మంది అభిమానుల్ని సంపాదించుకున్నారు మంచు మనోజ్. అలాంటి హీరో తన పుట్టిన రోజు (మే 20) సందర్భంగా మంగళవారం నాడు మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించారు. తన ఐక్య ట్రస్ట్, తన సినీ ప్రయాణం, రాజకీయ ప్రవేశం వంటి విషయాల గురించి ఎన్నో విశేషాల్ని పంచుకున్నారు. ఈ క్రమంలో ఆయన చెప్పిన సంగతులివే..**

**'ఐక్య' పెట్టాలనే ఆలోచన ఎలా వచ్చింది?**

నేను సూపర్ మ్యాన్‌ని కాదు. అందరికీ అన్ని వేళలా అందుబాటులో ఉండకపోవచ్చు. అందుకే ఈ ట్రస్ట్‌ను పెట్టాలని అనుకున్నాం. వాయిస్ లెస్‌కి వాయిస్‌గా ఈ ట్రస్ట్ ఉంటుంది. అలా 'ఐక్య ధైర్య సేనా సమితి' అని పెట్టడానికి చాలా కారణాలున్నాయి. ఐక్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలం. విభజించుకుంటూ వెళ్తే చివరకు ఏమీ మిగలదు. అందుకే అందరం ఐక్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఐక్య అని పెట్టాం. నా కొడుకు పేరు ధైరవ్, నా బిడ్డ పేరు దేవ సేన ఇలా అందరి పేర్లు కలిపి 'ఐక్య ధైర్య సేనా సమితి' అని పెట్టాం. ఈ ట్రస్ట్ కూడా మాకు ఓ బిడ్డ లాంటిదే.

**'ఐక్య' ట్రస్ట్ ఎలా వర్క్ చేస్తుంది? నియమాలు ఏంటి?**

'ఐక్య'కి ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదు. ఎప్పటి నుంచో ఇలాంటి ఓ ట్రస్ట్‌ను ఏర్పాటు చేయాలని అనుకున్నాం. దానికి సంబంధించిన నియమాల్ని ఇంకా రూపొందించలేదు. మేం ప్రస్తుతం అదే పనిలో ఉన్నాం. కావాల్సిన నిధి కోసం మేం ఫండ్ రైజింగ్ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తాం.

**'ఐక్య'కి ఇతర వివరాల్ని ఎప్పుడు ప్రకటిస్తారు?**

జూన్ 7న నా కొత్త సినిమా 'రక్షక్' ప్రారంభం కాబోతోంది. ప్రస్తుతం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళా సాధికారత నేపథ్యంలో 'రక్షక్' చిత్రం ఉంటుంది. అందులో నేను డీసీపీగా పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నాను. ఆ మూవీ ప్రారంభోత్సవం నాడే 'ఐక్య'కి సంబంధించిన అన్ని విషయాల్ని అధికారికంగా ప్రకటిస్తాను. అంతలోపు 'ఐక్య' కోసం మీడియా వారి నుంచి కూడా సలహాలు తీసుకుంటాను.

**మీ సినీ ప్రయాణం ఎలా సాగుతోంది? కథల ఎంపికలో పూర్తి నిర్ణయం మీదేనా?**

నాకు సినిమాల్లో మళ్లీ పునర్జన్మను ఇచ్చిన విజయ్ కనకమేడల గారికి, కార్తిక్ ఘట్టమనేని గారికి జీవితాంతం రుణపడి ఉంటాను. ప్రస్తుతం అన్ని రకాల పాత్రల్ని చేయాలని అనుకుంటున్నాను. కెరీర్ ప్రారంభం నుంచీ ఇప్పటి వరకు ప్రతీ స్క్రిప్ట్, కథని నేనే విన్నాను. నేనే ఓకే చేశాను. ఇప్పుడు కూడా నేనే వింటాను. నాకు నచ్చిన కథల్నే చేస్తాను. నా వృత్తిపరమైన జీవితంలోకి నా భార్య గానీ, ఆమె వృత్తిపరమైన జీవితంలోకి నేను గానీ వెళ్లం. మేం పరస్పరం ఆ విషయంలో ఒకరినొకరిని గౌరవించుకుంటాం.

**ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎప్పుడు వస్తారు?**

మేం పుట్టినప్పటి నుంచీ రాజకీయాల్లోనే ఉన్నాం. కొత్తగా రాజకీయాల్లోకి రావడం అని ఏముంది. వచ్చే ఎన్నికల్లో నా భార్య పోటీ చేస్తారు.

**మే 20 అంటే ఎన్టీఆర్, సిరివెన్నెల సీతారామశాస్త్రి పుట్టిన రోజు కూడా కదా..?**

నా పుట్టిన రోజుని తారక్ అన్నతో, స్వర్గీయ సిరివెన్నెల సీతారామ శాస్త్రి గారితో కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉంటుంది. సిరివెన్నెల గారికి అంతం అంటూ ఉండదు. ఆయన ఎప్పుడూ మనతోనే ఉంటారు. మనలోనే ఉంటారు.

**'డేవిడ్ రెడ్డి' ఎలా ఉండబోతోంది?**

నేను దాని గురించి ప్రత్యేకంగా చెప్పేకంటే రేపు (మే 20) సాయంత్రం గ్లింప్స్ రాబోతోంది. మాటల కంటే మన పని చెబితేనే బెటర్. షూటింగ్ దాదాపు 40 శాతం పూర్తయింది. హనుమా రెడ్డి గారు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా షూటింగ్ చేస్తున్నారు. మధ్య ప్రదేశ్‌లో ఈ మధ్యే షూటింగ్ చేసి వచ్చాం. మధ్య ప్రదేశ్ ప్రభుత్వం మా అందరినీ ఎంతో బాగా చూసుకున్నారు.

**'వాట్ ది ఫిష్' పరిస్థితి ఏంటి?**

'వాట్ ది ఫిష్' ఇప్పుడు రావడం లేదు. అనుకోని కారణాల వల్ల అది కుదరలేదు. నేను, సత్య, వెన్నెల కిషోర్ అందరం కలిసి చేయాల్సిన



సినిమా. చివరి నిమిషంలో చాలా మందికి వీసా ప్రాబ్లం వచ్చింది. స్క్రిప్ట్ బాగుంది. మిగిలిన అన్ని పరిస్థితులు కూడా కలిసి రావాలి. ఆ టైం ఎప్పుడు వస్తుందో చూడాలి.

**'మోహన రాగ మ్యూజిక్' పనులు ఎక్కడి వరకు వచ్చాయి?**

'మోహన రాగ మ్యూజిక్' చాలా బాగా వస్తుంది. అద్భుతమైన ఆర్టిస్టులు, టెక్నీషియన్లు, సింగర్లు పని చేస్తున్నారు. ఇప్పటి వరకు నాలుగు పాటలు రికార్డ్ అయ్యాయి. మరో నాలుగు పాటలు రెడీ కావాల్సి ఉంది. ఇంకో రెండు, మూడు నెలల సమయం పట్టేలా ఉంది.

**'నమస్తే వరల్డ్' టాయ్స్ గురించి చెప్పండి?**

మౌనిక గారు 'నమస్తే వరల్డ్' టాయ్స్ గురించి పని చేస్తున్నారు. త్వరలోనే బెంగళూరులో, రెండు తెలుగు రాష్ట్రాల్లో బ్రాంచ్‌లు ఏర్పాటు చేయాలని చూస్తున్నారు. ఆమెకు నేను జస్ట్ సపోర్ట్‌గా ఉంటున్నాను.

**ప్రస్తుతం చేస్తున్న సినిమాల గురించి చెప్పండి?**

ప్రస్తుతం నా చేతిలో ఐదారు ప్రాజెక్టులున్నాయి. వాటికి సంబంధించిన అనౌన్స్మెంట్‌లు ఈ నెలలోనే వస్తాయి. ప్రతీ హీరో నుంచి కంటిన్యూగా సినిమాలు రావాలని కోరుకుంటున్నాను. నేను కూడా వరుసపెట్టి చిత్రాలు చేయాలనే ప్లానింగ్‌లోనే ఉన్నాను. ప్రస్తుతం చేతినిండా ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాను.

# పెద్ది నా కెరీర్‌లో చేసిన మోస్ట్ ఇన్‌స్పైరింగ్ సినిమా

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్-ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు ముందే సంచలనం సృష్టిస్తోంది. ప్రతి ప్రోమో దేశవ్యాప్తంగా బజ్ క్రియేట్ చేసింది. దర్శకుడు బుచ్చి బాబు సానా ఈ రూరల్ యాక్షన్-స్పోర్ట్స్ కథను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఆకట్టుకునే ఫస్ట్-లుక్ పోస్టర్లు, పాత్రల గ్లింప్స్‌లు, పాటలు ఈ చిత్రంపై అంచనాలను మరింత పెంచాయి. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రాన్ని, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను ముంబైలో జరిగిన ఈవెంట్ లో లాంచ్ చేశారు. రెగ్యులర్ హీరో ఇంట్రడక్షన్ ట్రైలర్‌లా కాకుండా.. 'పెద్ది' ట్రైలర్ ఒక పల్లె ప్రపంచాన్ని, అక్కడి జీవితాల్ని, పోరాటాన్ని, ఆటపై ఇష్టాన్ని ఎంతో సహజంగా పరిచయం చేసింది. పెద్ది అనే పాత్ర ఒక మల్టీ టాలెంటెడ్ అథ్లెట్. క్రికెట్, కుస్తీ, రన్నింగ్... ఏ ఆట అయినా తన శక్తితో నెగ్గే ఆటగాడు. అక్కడి యువతకు హీరోలా కనిపించే పెద్ది.. గ్రామస్తుల గౌరవాన్ని కూడా సంపాదించుకుంటాడు. అయితే అతని ఎదుగుదల ఒక ఆధిపత్య వర్గానికి నచ్చదు. అక్కడి నుంచి కథ అసలైన సంఘర్షణలోకి వెళ్తుంది. బుచ్చిబాబు సానా పెద్ది లార్జర్ దెన్ లైఫ్ ప్రపంచాన్ని తీర్చిదిద్దన తీరు ట్రైలర్‌లో అదిరిపోయింది. ప్రతి ఫ్రేమ్‌కి ఒక ఎమోషన్ ఉంది. ట్రైలర్ మొత్తం హార్ట్‌బీట్‌లా అనిపిస్తుంది.. నిశ్శబ్ద క్షణాల్లో సున్నితంగా, యాక్షన్ సన్నివేశాల్లో ఉరుములా బ్లాస్ట్ లా పేలింది. ఇది కేవలం స్పోర్ట్స్ డ్రామా కాదు.. ఆట, బతుకు, పోరాటం అన్నీ కలిసిన ప్రపంచం. ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో కేర్‌తో డిజైన్ చేయడంతో ప్రేక్షకులని ఎమోషన్‌తో నిండిన ప్రపంచంలోకి వెళ్లిపోయిన ఫీలింగ్ కలుగుతుంది. రైల్వే ప్లాట్‌ఫామ్‌లపై జరిగే భారీ ఘర్షణలు, గాల్లో ఎగిరే స్టంట్స్, మట్టిలో జరిగే కుస్తీ పోరాటాలు.. ప్రతి యాక్షన్ బ్లాక్ కొత్తగా కనిపిస్తోంది. ముఖ్యంగా క్రికెట్, కుస్తీని కలిపి డిజైన్ చేసిన యాక్షన్ సీక్వెన్స్ ట్రైలర్‌కే హైలైట్‌గా నిలిచింది. రామ్ చరణ్ ఈ సినిమాలో పూర్తిగా కొత్త అవతార్‌లో అదరగొట్టారు. ఆయన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్, బాడీ లాంగ్వేజ్, అథ్లెటిక్ ప్రెజెన్స్ అన్నీ కూడా పాత్రకు అద్భుతంగా సరిపోయాయి. ఒకవైపు ఫ్లడ్‌లైట్స్ కింద రఫ్ బ్యాట్‌తో క్రికెట్ ఆడే పెద్ది.. మరోవైపు మట్టిలో కుస్తీ పోరాటాల్లో దిగే పెద్ది.. ఈ రెండు షేడ్స్‌లో చరణ్ అద్భుతంగా కనిపించారు. ఇది కేవలం లుక్ మార్పు కాదు.. పూర్తిగా పాత్రలో లీనమై చేసిన పెర్ఫార్మెన్స్ అని ట్రైలర్ స్పష్టం చేసింది. జాన్వీ కపూర్ తన పాత్రలో ఎంతో నేచురల్‌గా కనిపించింది. గ్రామీణ యువతిగా ఆమె చూపించిన ఎక్స్‌ప్రెషన్స్ ట్రైలర్‌కు మంచి వార్మ్‌నెస్ తీసుకొచ్చాయి. అలాగే శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ పాత్రలు కూడా కథలో బలమైన ప్రాధాన్యం కలిగి ఉన్నాయని ట్రైలర్ సూచించింది. టెక్నికల్‌గా 'పెద్ది' మరో స్థాయిలో కనిపిస్తోంది. అవినాష్ కొల్లా రూపొందించిన పెద్ది ప్రపంచం అద్భుతంగా వుంది. రత్నవేలు సినిమాటోగ్రఫీ ట్రైలర్‌కు పెద్ద అసెట్‌గా నిలిచింది. ప్రతి ఫ్రేమ్‌లో రిచ్ విజువల్స్, డైనమిక్ కెమెరా మూమెంట్స్ కట్టిపడేశాయి. ఏఆర్ రెహమాన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు ఆత్మలా నిలిచింది. ఎమోషన్స్‌ను, యాక్షన్‌ను ఒకేసారి ఎలివేట్ చేస్తూ ఆయన ఇచ్చిన స్కోర్ ట్రైలర్‌ను మరింత పవర్‌ఫుల్‌గా మార్చింది. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌లో నిర్మించిన ఈ సినిమా ప్రతి ఫ్రేమ్ కూడా బిగ్ స్క్రీన్ అనుభూతిని కలిగిస్తోంది. ప్రేక్షకులను పూర్తిగా లీనం చేసే ఎక్స్ పీరియన్స్ అందిస్తుంది. విడుదలకు ఇంకా కొద్ది రోజులు మాత్రమే ఉండగా.. ట్రైలర్ తో 'పెద్ది'పై అంచనాలు ఇప్పుడు తారాస్థాయికి చేరుకున్నాయి. ముంబైలో గ్రాండ్ గా జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ... గుడ్ ఈవెనింగ్ ముంబై. మీడియా మిత్రులందరికీ ధన్యవాదాలు. ఈ సినిమా కోసం గత రెండేళ్లుగా ప్రాణం పెట్టి పని చేశాం. బుచ్చిబాబు అయితే గత ఐదేళ్లుగా ఈ సినిమాతోనే ట్రావెల్ అవుతున్నారు. బుచ్చిబాబుకి ఒక విషయంలో ప్రత్యేకంగా థ్యాంక్స్ చెప్పాలి. రెహమాన్ గారిని ఈ ప్రాజెక్ట్‌లోకి తీసుకొచ్చేలా కన్విన్స్ చేశారు (నవ్వుతూ). ప్రతి ప్రాజెక్ట్‌కు నాలుగు పిల్లర్లు ఉంటాయి. కానీ మా ప్రాజెక్ట్‌కు సెంటర్ పిల్లర్ రెహమాన్ గారు. రెహమాన్ గారి మ్యూజిక్ అంటే నాకు ఎంతో అభిమానం. ఆయన 'పెద్ది'లో భాగం కావడం మాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. దివ్యేందు ఒక గ్యాంగ్‌స్టర్. తనకంటూ ఓ స్టైల్ స్వాగ్ కనిపిస్తాడు. రత్నవేలు గారితో ఇది నాకు ఐదో చిత్రం. ఆయన మాస్టర్. ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో అందంగా తీర్చిదిద్దారు. జాన్వి చాలా హార్డ్‌వర్కింగ్ పర్సన్. తనలో చాలా డెడికేషన్ ఉంది. తన పాత్రను ఎంతో నిజాయితీగా చేసింది. మా నాన్నగారు, శ్రీదేవి మేడం కలిసి సినిమాలు చేశారు. జాన్వి, నేను కలిసి నటించాలని ఫ్యాన్స్ ఎప్పటినుంచో కోరుకుంటున్నారు. ఇది మాకు ఒక నోస్టాల్జిక్ మూమెంట్. బుచ్చిబాబు ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ఇక్కడికి వచ్చిన తెలుగు అభిమానులందరికీ పేరుపేరునా నమస్కారం. ఈ క్యారెక్టర్ చేయడం ఫిజికల్‌గా చాలా చాలెంజింగ్. సల్మాన్ ఖాన్ గారు, ఆమిర్ ఖాన్ గారు 'సుల్తాన్', 'దంగల్' లాంటి చిత్రాలతో మాకు ఒక ఇన్స్పిరేషన్ ఇచ్చారు. వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు. బుచ్చిబాబు కథ చెప్పినప్పుడే ఈ పాత్ర కోసం ట్రాన్స్‌ఫర్మ్ అవ్వాలని తెలుసు. ఇది చాలా నిజాయితీగా చేసిన సినిమా. అందరికీ ఒక ఐడెంటిటీ కావాలి. అలాంటి ఐడెంటిటీ కోసం చేసే ప్రయాణం. ఈ కథని దర్శకుడు చాలా ఆర్గానిక్‌గా, అలాగే హైలీ కమర్షియల్‌గా చూపించారు. ప్రేక్షకులందరూ చాలా సర్‌ప్రైజ్ అవుతారు. నా కెరీర్‌లో చేసిన మోస్ట్ ఇన్స్పైరింగ్ ఫిల్మ్ ఇది. ఇలాంటి సినిమాలు దశాబ్దంలో ఒకసారి మాత్రమే వస్తాయి. 'మగధీర', 'రంగస్థలం', 'ఆర్‌ఆర్‌ఆర్' లాంటి సినిమాలు తరచుగా రావు. అవి రావాలంటే సంవత్సరాలు పడుతుంది. పెద్ది కూడా లాంటి అరుదైన సినిమా . 'ఇలాంటి సినిమాలు మళ్లీ మళ్లీ రావు. ఇలాంటి సినిమా చేస్తున్నపుడు ప్రతిక్షణం ఆస్వాదించాలి' అని నాన్నగారు చెప్పేవారు. మంచి సినిమాలు అంత ఈజీగా రావు. 'మగధీర' చెప్పిన ఏళ్ల తర్వాత 'రంగస్థలం' వచ్చింది. తర్వాత ఆర్‌ఆర్‌ఆర్ వచ్చింది. లక్కీగా పెద్ది త్వరగానే వస్తుంది. ఇది నా లైబ్రరీలో ఎప్పటికీ దాచుకునే సినిమా. హీరోయిన్ జాన్వి కపూర్ మాట్లాడుతూ.. ఈ సినిమా కోసం మేము గత రెండేళ్లుగా పని చేస్తున్నాం. మీ అందరితో కలిసి ట్రైలర్ చూడడం చాలా ఆనందంగా ఉంది. ఇది మాకు చాలా స్పెషల్ మూమెంట్. బుచ్చిబాబు గారు చాలా రౌడీ డైరెక్టర్ (నవ్వుతూ). తనకు కావాల్సిన ఔట్‌పుట్ వచ్చే వరకు వదిలిపెట్టరు. రెహమాన్ గారు మ్యూజిక్ చేసే సినిమాలో నటించడం ఒక గౌరవం. రామ్ చరణ్ గారితో కలిసి పని చేయడం నా జీవితంలో గొప్ప గౌరవం. అమ్మగారు, చిరంజీవి గారు నటించిన సినిమాలకు ప్రేక్షకులు ఎంతో ప్రేమ చూపించారు. మా కాంబినేషన్ కూడా ప్రేక్షకులకు ఎదురుచూశారు. 'పెద్ది' నాకు చాలా స్పెషల్ ఫిలిం. రామ్ చరణ్ గారు ద బెస్ట్ పర్సన్. ఈ సినిమాను మీరందరూ ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను. ఏఆర్ రెహమాన్ మాట్లాడుతూ.. "నేను తమిళ్ సినిమాలు చేస్తూ, అవి తెలుగులో డబ్ అవుతూ వచ్చాయి. అయితే నేరుగా తెలుగు సినిమా చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. 'పెద్ది' రూపంలో ఆ అవకాశం వచ్చింది. బుచ్చిబాబు గారు ఈ కథ చెప్పినప్పుడు ఆయన కళ్లలో ఉన్న ప్యాషన్ చూశాను. అప్పుడే ఇది నా ఫస్ట్ తెలుగు సినిమా కావాలని అనిపించింది. బుచ్చిబాబు గారికి, రామ్ చరణ్ గారికి, సతీష్ గారికి థ్యాంక్యూ. బుచ్చిబాబు ప్రతి ఫ్రేమ్‌ను చాలా డీటైల్‌గా తీర్చిదిద్దారు. రామ్ చరణ్ గారి హార్డ్‌వర్క్‌ను నేను ఫిజికల్‌గా, మెంటల్‌గా చూశాను. బుచ్చిబాబు సాఫ్ట్‌గా కనిపిస్తారు కానీ తనకు కావాల్సిన ఔట్‌పుట్ వచ్చే వరకు ఎక్కడా రాజీపడరు. ఇది చాలా స్పెషల్ ఫిలిం., నిర్మాత సతీష్ కిలారు మాట్లాడుతూ.. "ఈవెంట్‌కు వచ్చిన అందరికీ థ్యాంక్యూ. ముంబై నుంచి ప్రమోషన్స్ కిక్‌స్టార్ట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఇది ఒక అద్భుతమైన సినిమా. గత రెండేళ్లుగా ఈ సినిమా కోసం చాలా హార్డ్‌వర్క్ చేశాం.



Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/A2380